


'సోమశిల'లో 50 టీఎంసీల నీరు

అనంతసాగరం, సెప్టెంబరు 16: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 14,404 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, జలాశయంలో 50.002 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ కండలేరుకు 10 వేలు, డెల్టాకు 50 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు వివరించారు.



జిల్లాలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. ఎంతలా అంటే ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (గ్రీవెన్స్) వచ్చే అర్జీల్లో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయి. 2019కు ముందు వరకూ గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల్లో 20 శాతం భూ సమస్యలు ఉండేవి. కానీ ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. అంటే గడిచిన ఐదేళ్లలో జరిగిన తప్పులు, అక్రమాల మూలంగా సమస్యలు రెట్టింపయ్యాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూన్ 15వ తేదీ నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తోంది. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతీ వారం సరాసరి 300 వరకూ అర్జీలు వస్తున్నాయి. ఈ మూడు నెలల్లో 3,432 అర్జీలు అందగా, 1551 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే. ఇవన్నీ భూ సమస్యలకు చెందినవి కావడంతో ఉన్నతాధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గత ప్రభుత్వ పాలనకు ఇది నిదర్శనంగా కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గ్రీవెన్స్...!

ఇప్పటి వరకు అందిన అర్జీలు : 3,432 | పరిష్కరించినవి : 2,328 | పరిష్కార దశలో ఉన్నవి : 932 | తిరస్కరణ : 172

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భారీగా అర్జీలు
- సగానికిపైగా భూసమస్యలపైనే!
- భ్రష్టుపట్టించిన గత ప్రభుత్వం
- ఇప్పటికీ గాడిలో పడని రెవెన్యూ శాఖ
- అరకొర పరిష్కారంతో తప్పించుకునే ప్రయత్నం

నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు భూములను ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు అన్న తేడా లేకుండా ఇష్టారీతిన రికార్డులు మార్పు చేసి వివాదాలు సృష్టించారు. నాడు రెవెన్యూ అధికారులు కూడా వైసీపీ నేతలు చెప్పినట్లు చేయడంతో సమస్యలు ఎక్కువయ్యాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఎన్ని అర్జీలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పుడు అటువంటి భూ బాధితులంతా ఉన్నతాధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. వారికి జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటూ బోరుమంటున్నారు. ఇక సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో తీసుకొచ్చిన భూముల రీసర్వే ప్రక్రియ కూడా కొత్త సమస్యలు తెచ్చి పెట్టింది. సరైన విధివిధానాలు లేకపోవడం, వీటిపై జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అధికారుల వద్దనున్న రికార్డుల ప్రకారం రీసర్వే చేశారు తప్ప రైతుల వద్దనున్న రికార్డులను పట్టించుకోలేదు. ఒక ప్రభుత్వ భూమిని ఎప్పుడో ప్రభుత్వం పట్టాలు చేసి ఉండి, ఆ తర్వాత ఆ భూమిపై క్రయవిక్రయాలు జరిగి ఉన్నప్పటికీ అటువంటి భూములను తాజా రీసర్వేలో ప్రభుత్వ భూమిగా నమోదు చేసి నిషేధిత జాబితాలోకి చేర్చారు. ఇక నోషనల్ ఖాతాలను కూడా సవరించకుండా వాటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

ఇప్పటిదాకా ప్రధాన శాఖలకు అందిన అర్జీలు

శాఖ పేరు	అర్జీలు	పరిష్కారం	పెండింగ్
రెవెన్యూ	1551	834	621
మున్సిపల్	365	332	27
పంచాయతీ	203	152	49
సర్వే శాఖ	146	90	36
పోలీసు శాఖ	242	179	45
ఇరిగేషన్	79	49	28
సివిల్ సప్లయిస్	49	39	10
విద్యుత్	65	51	11
విద్యాశాఖ	49	39	10

● పరిష్కారం కాని సమస్యలు

పెద్ద ఎత్తున భూ సమస్యల అర్జీలు అందుతున్నా ఆ స్థాయిలో పరిష్కారం మాత్రం జరగడం లేదు. మండల స్థాయిలో పరిష్కరించకపోతేనే చాలా వరకూ సమస్యలు జిల్లా అధికారుల వద్దకు వస్తాయి. అటువంటి వాటిని మళ్లీ మండల అధికారుల వద్దకే పంపుతుండటంతో సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. బాధితుడు పదే పదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. ఉదాహరణకు నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వద్ద జరిగిన ఓ భారీ స్కామ్‌నే ఇందుకు నిదర్శనం. గతంలో అసైన్‌మెంట్ కింద పేదలకు ఇచ్చిన భూములను కొందరు తప్పుడు మార్గంలో రెవెన్యూ రికార్డులు మార్పు చేసి ఆక్రమించుకున్నారని బాధితుల ఫిర్యాదు. గత ప్రభుత్వంలో పట్టించుకోగ పోగా ఈ ప్రభుత్వం రాగానే ఇక్కడ తప్పు జరిగినట్లు సాక్షాత్తూ ఆర్డీవోనే నిర్ధారించారు. దీంతో సదరు మ్యుటేషన్లను రద్దు చేసి కొత్తగా ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చి మ్యుటేషన్లు చేయాలని కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారు. అయినా మండల రెవెన్యూ అధికారులు మాత్రం అక్కడ అసలు తప్పే జరగలేదని గ్రీవెన్స్ అర్జీకు సమాధానం ఇస్తూ సమస్య పరిష్కరించినట్లు క్లోజ్ చేయడం గమనార్హం. అలానే నోషనల్ ఖాతాలకు సంబంధించి సులభంగా పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ల్యాండ్ మేటర్ సెక్షన్‌లో భారీగా ఫైళ్లు పెండింగ్ ఉన్నాయి. ఇప్పటికీ జిల్లాలో రెవెన్యూ శాఖ గాడిలో పడలేదు. ఈ శాఖపై పర్యవేక్షణ కూడా కొరవడింది. కొన్నాళ్లపాటు జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడం, ఆ తర్వాత కొత్త జేసీ వచ్చినప్పటికీ ఆయన విజయవాడ వరదల నివారణ విధుల్లో ఉండడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి గతంలోలానే కొనసాగుతోంది. ఇటువంటి ఫైళ్లు కలెక్టరేట్‌లో వందల సంఖ్యలో పెండింగ్ ఉండటం గమనార్హం.

ఇసుక అమ్మకాలు 19 నుంచి?

ఆన్‌లైన్, సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయాల్లో బుకింగ్

ప్రస్తుతానికి మూడు చోట్ల నిల్వలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 16 : జిల్లాలో ఈ నెల 19 నుంచి ఇసుక అమ్మకాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ విధానంలో పడవల ద్వారా పెన్నానది నుంచి ఇసుకను బయటకు తీసి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. డ్రెడ్జింగ్ చేయడానికి, నది నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుకను తరలించేందుకు అయ్యే ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక రూ.380గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక స్టాక్ పాయింట్ నుంచి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉండనున్నాయి. ఆన్‌లైన్‌తోపాటు సచివాలయాలు, తాహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఇసుక కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఇప్పటికే పోతిరెడ్డిపాళెం వద్దనున్న షుగర్ ఫ్యాక్టరీ, సంగం, పొదలకూరు వద్దనున్న సూరాయపాళెం ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకొన్న వారు రశీదు చూపించి తీసుకువెళ్లవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సరఫరా చేసే వాహనాల రవాణా చార్జీలు ఒకే విధంగా ఉండేలా ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● త్వరలో మరింత తగ్గుదల

పర్యావరణ అనుమతులు రాకపోవడంతో ప్రజలకు ఇసుక సరఫరా కాస్త భారంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆ అనుమతులు వచ్చాక ఇసుక ధరలు మరింత తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 10 రీచ్‌లు ఉండగా, వీటన్నిటికీ పర్యావరణ అనుమతులు రానున్నాయి. నేరుగా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా ప్రారంభం కానున్నది. అదే జరిగితే ధరలు మరింత తగ్గి కేవలం కూలీలు, రవాణా చార్జీలతోనే ఇసుక సరఫరా జరుగుతుంది.

కిలోమీటరుకు సగటు చార్జీ జీఎస్టీతో కలుపుకొని.. (రూ.లలో)

దూరం (కి.మీ)	ట్రాక్టర్ (4.5 టన్నులు)	లారీ (10 టన్నులు)	లారీ (18-35 టన్నులు)
0-10	13.5	10.7	9.4
11.8	12.8	10.2	8.9
21-30	12.8	10.2	8.9
31-40	12.8	10.2	8.9
40-80	6.3	6.3	6.3
80పైన	-	3.5	3.5



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ఇసుక నిల్వ

అక్రమ లేఅవుట్లలో 120 ఎకరాల ప్రభుత్వ భూమి

- కాలువలు, గుంటలు 70 ఎకరాల స్వాధీనం
- మరో 50 ఎకరాల స్వాధీనానికి చర్యలు
- తప్పుడు సమాచారం ఇచ్చిన ఉద్యోగులపై చర్యలు
- కావలి కమిషనర్, తహసీల్దారు వెల్లడి

కావలి, సెప్టెంబరు 16 : కావలి పట్టణ పరిధిలోని అక్రమ లేఅవుట్లలో 120 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్ వెల్లడించారు. అక్రమలేఅవుట్లలో 120 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని పత్రికల్లో కథనాలు రాగా, అవి ఎక్కడున్నాయో చూపించాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పలు సందర్భాలలో ప్రశ్నించారు. సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా చూపించలేదని వెల్లడించారు. అయితే, అనూహ్యంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, తహసీల్దారు అక్రమ లే అవుట్ల వివరాలు వెల్లడించడంపై పెద్ద చర్చ నీయాంశమైంది. ఇంకా సర్వే కొనసాగుతోందని వారు చెప్పడంతో ప్రభుత్వ భూమి ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. కమిషనర్ మాట్లాడుతూ 70 ఎకరాల వరకు కాలువ, గుంతలనే గుర్తించి, వాటిని మళ్లీ యథాస్థితికి తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మరో 50 ఎకరాలను కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. అయితే సమాచార హక్కు చట్టం కింద అసంపూర్తి సమాచారం ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అక్రమ లేఅవుట్లలో ఎక్కడా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరని, ఎవరైనా నిర్మిస్తుంటే వెంటనే ఆపాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో ముస్లింల ర్యాలీ



చిన్నబజార్‌లోని షహింషా మసీద్‌లో ఆసార్ చూస్తున్న ముస్లిం మహిళ

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

జిల్లావ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబి చివరి మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు, దివ్య ఖురాన్ ప్రవచనాలతోపాటు పేదలకు అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం మహ్మద్ ప్రవక్తకు కృతజ్ఞతగా ముస్లిం జెండాలతో జూలూస్ (కృతజ్ఞతా ర్యాలీ) ఊరేగింపులు నిర్వహించారు. నెల్లూరు నగరంలో ఇస్లామి జెండాలు చేతబట్టి మహమ్మద్ ప్రవక్తను కీర్తిస్తూ కార్లు, బైక్‌ల ర్యాలీ జరిగింది. కోటమిట్ట నుంచి బయలుదేరిన ర్యాలీ పెద్దబజారు, ఆచారి వీధి, నెహ్రూ బొమ్మ, గాంధీబొమ్మ, ఏసీ బొమ్మ, సంతపేట, చిన్నబజార్, పెద్దబజార్ మీదుగా తిరిగి డైకస్‌రోడ్డు, కోటమిట్ట వరకు సాగింది.

- నెల్లూరు (సాంస్కృతికం)

పవిత్రోత్సవ సంబరం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు, సెప్టెంబరు 16 : పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాల సందర్భంగా రెండోరోజు సోమవారం శ్రీవార్లకు ఉదయం విశేష హోమాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, నివేదన, శాత్తుమురై తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్య నిర్వహణాధికారి కేవీ సాగర్‌బాబు తెలిపారు.

ఈ-పంట నమోదు 23 వరకు పొడిగింపు

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 16 : ఈ-పంట నమోదు ప్రక్రియను ఈ నెల 23వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నాటికే గడువు ముగిసినా రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. 25 నుంచి 27వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామసభలు, 28వ తేదీన దీనికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించి తుది జాబితా 30వ తేదీన రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడమే తరువాయి ధరలు అమాంతం పెరిగిపోయాయి. పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె లీటరుకు రూ.20 నుంచి 30 వరకు ఎగబాకింది. వంట నూనె ధరల పెంపుతో అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. కొత్త సరుకులపై కాకుండా నిల్వవున్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి డిమాండ్ సృష్టిస్తున్నారు.

వంటనూనెలు సలసల

- దిగుమతి సుంకం పెంచిన కేంద్రం
- ఆ వెంటనే ధరల పెరుగుదల
- లీటరుపై రూ.20 నుంచి 30 దాకా వడ్డన
- జిల్లావాసులపై నెలకు రూ.240 కోట్ల వరకు భారం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 16 : వంటకు ఎక్కువగా వినియోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెపై గతంలో ఎన్నడూలేని విధంగా కేంద్రం భారీగా దిగుమతి సుంకం విధించింది. ఇప్పటివరకు పామాయిల్‌కు ఈ సుంకం లేదు. అయితే, ఇప్పుడు 27.5 శాతం డ్యూటీ విధించారు. అలాగే సన్‌ఫ్లవర్‌పై 13 శాతం ఉన్న డ్యూటీని 35.5 శాతానికి పెంచేశారు. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు రూ.1,605 వరకు ఉండగా రూ.2,055వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.137లకు ఎగబాకింది. అంటే లీటరుపై రూ.29 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర మొన్నటి వరకు రూ.1,410 ఉండగా, ఇప్పుడది రూ.1,710 దాటింది. లీటరు ధర రూ.94 నుంచి రూ.114లకు చేరగా లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహారపదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతుల వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా గాడితప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 - 110 వరకు వుండగా, అవి ఇప్పుడు రూ.125-130లకు చేరాయి.

● రోజుకు 4 లక్షల కిలోలు..

జిల్లాలో రోజుకు 180 టన్నుల పామాయిల్, 60 టన్నుల సన్‌ఫ్లవర్ ఆయిల్, లీటరు ప్యాకెట్లు 10 టన్నుల మేర విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ప్రకారం రోజుకు దాదాపు 4 లక్షల కేజీల పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దిగుమతి సుంకం పెంపు కారణంగా రోజుకు దాదాపు రూ.8.5 కోట్ల నుంచి 9.5 కోట్ల మేర, నెలకు రూ.240 కోట్ల నుంచి 270 కోట్ల మేర ప్రజలపై అదనపు భారం పడింది. దీనిపై పేద, మధ్య తరగతి కుటుంబాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిత్యావసర సరుకుల్లో భాగమైన వంటనూనెలపై పెనుభారాన్ని తగ్గించి, ధరలను పేదలకు అందుబాటులో తెచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కేంద్రం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని శనివారం డెలివరీ ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపార సంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ మలేసియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది.



విద్యారంగం ఉన్నతికి, విద్యార్థుల భవితకు కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లు, లాబీయింగ్‌లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పోస్టింగ్‌లు కేటాయించడం, డిప్యుటేషన్‌లు చేపట్టడం వంటి అంశాలు ఇటీవల విద్యాశాఖలో సర్వసాధారణమై పోయాయి. తాజాగా సైన్స్ కేంద్రం ఇన్‌ఛార్జిగా, జిల్లా సైన్స్ అధికారి (ఇన్‌ఛార్జి)గా ఓ లెక్కల మాస్టారును నియమించడం విమర్శలకు తావిస్తోంది.

లెక్కల మాస్టారుకు 'సైన్స్' బాధ్యతలు

- నిబంధనలకు విరుద్ధంగా నియామకం
- గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 16 : ఎంతో కీలకమైన జిల్లా సైన్స్ అధికారి పోస్టింగ్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడిని నిబంధనలకు విరుద్ధంగా నియమించడంపై ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశమైంది. ప్రధానోపాధ్యాయుడు, అంతకన్నా పెద్ద హోదా కలిగిన వారు మాత్రమే నిర్వర్తించే ఈ బాధ్యతలను కొన్నేళ్లుగా అనర్హులకు కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి తమకు సంబంధించిన వ్యక్తిని సైన్స్ అధికారిగా నియమించేలా పావులు కదపడంతో నాటి డీఈఓ తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనకు జిల్లా సైన్స్ అధికారి బాధ్యతలు అప్పగించారు. ఈ పోస్టులో నియమితులైన వారు తమ పాఠశాల విధులు నిర్వర్తిస్తూనే అదనంగా సైన్స్ అధికారి విధులు కూడా నిర్వర్తించాల్సి ఉండగా పాఠశాలకు పూర్తిగా డుమ్మాకొట్టి సైన్స్ అధికారిగానే చెలామణి అవుతూ ఐదేళ్లు గడిపేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో పనిచేసిన అధికారి తన పదవిని స్వచ్ఛందంగా వదిలేసి ఉపాధ్యాయ విధుల్లో చేరిపోయారు. దీంతో ఈ పోస్టును పొందేందుకు ఎవరికి వారు తమ శక్తి మేరకు పలుకుబడులు ఉపయోగించారు. అయితే, నెల్లూరులో నివాసం ఉంటూ రాపూరు మండలంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ గణితం మాస్టారు లాబీయింగ్‌లో సఫలీకృతులయ్యారు. ఓ ప్రజాప్రతినిధి ద్వారా జిల్లా సైన్స్ కేంద్రం ఇన్‌చార్జిగా ఉత్తర్వులు సాధించుకున్నారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా డీఈఓ అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు జిల్లా సైన్స్ అధికారిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించడంపై సైన్స్ ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను కూడా తమకు అనుకూలంగా వినియోగించుకోవచ్చన్న దురాశతోనే పైరవీలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై జిల్లా పాలనాధికారులు దృష్టి సారించి నియమ, నిబంధనలకు అనుగుణంగా జిల్లా సైన్స్ అధికారి నియామకం చేపట్టాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి.



డీజే సౌండ్ తగ్గించమన్నందుకు దాడి

గ్రామోత్సవంలో రెచ్చిపోయిన యువకులు ● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

సంగం, సెప్టెంబరు 16: వినాయక ప్రతిమల గ్రామోత్సవంలో యువకులు రెచ్చిపోయారు. ఇంట్లో పసిబిడ్డ, గుండెజబ్బుతో బాధపడుతున్న రోగి ఉన్నాడు.. డీజే సౌండ్ తగ్గించమన్నందుకు యువకులు ఆ ఇంట యువతులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం రాత్రి సంగంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సంగంలోని ఓ కాలనీలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన గణేశ్ విగ్రహానికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే ఏర్పాటు చేశారు. గ్రామోత్సవం రామాలయం వద్దకు రాగానే ఆ సెంటర్‌లో కోకిల ప్రియాంక, కిన్నెర అనే యువతులు తమ ఇంట్లో ఓ పసిబిడ్డ, గుండెజబ్బుతో బాధపడుతున్న రోగి ఉన్నారు.. డీజే సౌండ్ తగ్గించమని నిర్వాహకులకు చెప్పడంతో వారు రెచ్చిపోయి ఇంకా ఎక్కువ సౌండ్‌తో, టపాకాయలు కాల్చడం మొదలు పెట్టారు. అంతటితో ఆగక వారిపై యువకులు దాడిచేసి గాయపరిచారు. దీంతో వారు జిల్లా ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ వేమారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ సైదుల్లా సంఘటనా స్థలానికి వచ్చేటప్పటికి గ్రామోత్సవం అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడిచేసిన 9 మందిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దాడిలో గాయపడిన ప్రియాంక, కిన్నెర

బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాల దరఖాస్తుకు గడువు పెంపు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 16 : ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఈ నెల 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం పెంచిందని బీడీ కార్మికుల సంక్షేమ ఆసుపత్రి డాక్టర్ అర్జున్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 0120-6619540 హెల్ప్‌లైన్‌కుగానీ టెలీఫోన్ నెంబరు 29501297నుగానీ సంప్రదించాలని ఆయన తెలిపారు.

కువైట్‌లో కమ్మవారిపల్లి వాసి మృతి



అనంతసాగరం, సెప్టెంబరు 16: జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లిన కమ్మవారిపల్లి వాసి ఆర్ వెంకటేశ్వర్లు(50) మృత్యువాతపడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు 2021లో కువైట్‌కు వెళ్లాడు. ఏమైందో ఏమోగాని రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు అక్కడి వారు సమాచారం అందించగా కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. అతని మృతదేహం కువైట్ నుంచి సోమవారం గ్రామానికి చేరుకోగా కన్నీరు మున్నీరయ్యారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 16 : మండలంలోని కంటేపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరులోని పద్మావతి సెంటర్‌కి చెందిన భానుప్రకాష్, వెంకటేశ్వర్లు మోటారు బైక్‌పై గొలగమూడికి వెళ్లి తిరిగి వస్తుండగా కంటేపల్లి సమీపంలోఆటో ఒక్కసారిగా అడ్డువచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటాచలంలోని సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. వివరాల మేరకు.. నగరంలోని మెడికవర్ వైద్యశాల వెనుక వైపు ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఎస్ రవికుమార్(60) అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఓ జూనియర్ కళాశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం నగరంలోని జాతీయ రహదారిపై కాఫీ కేఫ్ వద్ద బైక్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా చెన్నై వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవికుమార్ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు మృతుడి సోదరుడు వెంకటరమణరావు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి యువకుడు...

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు 16: మండలంలోని రేబాల వద్ద ఉన్న ఆంజనేయుడి విగ్రహానికి ఎదురుగా పంట కాలువలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ విషయం సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించిన రేబాలకు చెందిన దమనం వెంకటేష్ (36) హైవే పక్కనే ఉన్న పంట కాలువ కల్వర్టుపై పడుకుని నిద్రించాడు, సోమవారం ఉదయం అటుగా వెళ్లేవారు చూసేసరికి కాలువలోపడి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి నానమ్మ జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి బంధువులకు అప్పగించామన్నారు.

● స్తంభాన్ని ఢీకొన్న లారీ.. తప్పిన ప్రమాదం

బుచ్చి నగర పంచాయతీలోని రాజుపాళెం మార్గంలో సోమవారం ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగింది. స్థానికుల సమాచారంతో విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రమాదం తప్పింది.

ప్రెస్టీజ్ బ్రాండ్ పేరుతో నకిలీ వస్తువుల విక్రయం

● పోలీసుల కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 16: ప్రెస్టీజ్ బ్రాండ్ పేరుతో నకిలీ వస్తువులను విక్రయిస్తున్న వారిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్స్‌ను స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.. ఈ ఏడాది ఆగస్టు నెలలో శ్రీనివాస హోమ్ అప్లయన్సెస్‌వారు తమ కంపెనీ పేరుతో నకిలీ సేఫ్టీ వాల్వ్‌లు, కుక్కర్ విజిల్స్ విక్రయిస్తున్నట్లు కిచెన్ ఉపకరణాల తయారీ టీటీకే ప్రెస్టీజ్ లిమిటెడ్ వారు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా శ్రీనివాస హోమ్ అప్లియన్సెస్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి 900 సేఫ్టీ వాల్వ్‌లు, 144 కుక్కర్ విజిలెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ పరికరాలు ప్రెస్టీజ్ అనే బ్రాండ్ పేరుతో ఉన్నాయని గుర్తించారు. ఈ క్రమంలో కాపీరైట్ చట్టం 63 కింద కేసు నమోదు చేశారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, సెప్టెంబరు 16: స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సమీపంలోని రైలు పట్టాలపై సోమవారం కొండాపురం మండలం ఎర్రబల్లికి చెందిన మందా మాలకొండయ్య (73) మృతదేహాన్ని కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ వివరాల మేరకు.. మాలకొండయ్య ఈ నెల 14వ తేదీన ఇంటి నుండి కావలి వచ్చారు. దిగువమార్గం లో ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆయన కోసం గాలిస్తున్న బంధువులు ఏరియా వైద్యశాలలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7094
వెండి కిలో ధర	రూ. 91,000
వెండి ఒక గ్రాము	రూ. 94.00

పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం): దళిత యువకులను దారుణంగా కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ముత్తుకూరు మండలానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల మధ్య వివాదానికి తమ కుటుంబ సభ్యులైన అమావాస్య హరీష్, సందీప్‌లతోపాటు మరో నలుగురు యువకులను పోలీసులు దారుణంగా కొట్టారని తెలిపారు. దళితనేత అని చెప్పుకునే చాట్ల వెంకట సుబ్బయ్య అన్యాయం జరిగిన తమకు కాకుండా తప్పు చేసిన పోలీసులకు వత్తాసు పలుకుతున్నాడని తెలిపారు. ఈ మేరకు తాము జిల్లా కలెక్టర్‌ను కలిసి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు అను, పద్మ, శారద, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలకు సహకారం

● గత ప్రభుత్వంలో ఆర్బీకేలకే ప్రాధాన్యం
● నిర్వీర్యమైన పీఏసీఎస్‌లు
● కూటమి ప్రభుత్వంతో సొసైటీలకు జవసత్వాలు
● సర్టిఫికెట్ కోర్సుపై సిబ్బందికి శిక్షణ





సంగం, సెప్టెంబరు 16: రైతులకు సింగిల్ విండోల (సొసైటీలు) ద్వారా విత్తనాలు, ఎరువులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా లైసెన్సు తీసుకోవడం వంటి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు)ను నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకేలు) ఏర్పాటు చేసి వాటికే ప్రాధాన్యత ఇచ్చింది. సొసైటీలను పట్టించుకోకుండా ఎరువులను సైతం వాటికే కేటాయించింది. ఈ క్రమంలో రైతులు ఎరువుల కోసం అక్కడికి వెళితే ముందుగా నగదు కట్టించుకున్న తరువాత ఇచ్చేవారు. సొసైటీల్లో అయితే వారే ముందుగా ఎరువులు తెప్పించేవారు. రైతులు వెళ్లగానే డబ్బులు కట్టించుకుని ఎరువులు ఇచ్చేవారు. అప్పుకూడా ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాహకం వల్ల గత ఐదేళ్లుగా సింగి ల్ విండోల్లో ఎరువులు, విత్తనాల అమ్మకాలు లేకపోవడంతో వాటి లైసెన్సులను పునరుద్ధరించుకోలేదు.

● ప్రైవేటు డీలర్లే దిక్కు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో 78 సింగిల్ విండోలు ఉంటే, వాటిల్లో కొన్నింటికి మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. దీంతో ఎరువుల కోసం ప్రైవేటు డీలర్లపై రైతులు ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చేది. వారు సీజన్‌లో యూరియా, మిశ్రమ ఎరువులను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం సింగిల్ విండోలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసు కుంది.

● వచ్చే రబీ సీజన్ నుంచే...

వచ్చే రబీ సీజన్ నుంచే సొసైటీల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరు వులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో లైసెన్సులు పునరుద్ధరించుకోవాలని సింగిల్ విండోల కార్యదర్శులను సహకారశాఖ అధికారులు ఆదేశించారు. కొత్త లైసెన్సలు తీసుకోవాలన్నా ఉన్న వాటిని పునరుద్ధరించుకోవాలన్నా నిబంధనలు అడ్డువస్తున్నాయి. లైసెన్సు ఇవ్వాలంటే సింగిల్ విండో ల్లో ఉద్యోగి బీఎస్సీ (అగ్రికల్చర్) లేదా డిప్లమా చేసి ఉండాలి. విద్యార్హత లేకుంటే 15 రోజుల డిప్లమా కోర్సు పూర్తి చేయాలి. ఇందుకు రూ.15 వేలు ఖర్చవుతుంది. జిల్లాలోని అన్ని సొసైటీల్లోనూ ఎరువుల వ్యాపారం ప్రారంభించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధంమైంది. కాగా ఎరువుల అమ్మకాలపై సింగిల్ విండోల సిబ్బందికి వ్యవసాయశాఖ అధికారులతో శిక్షణ ఇప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

217 జీవో రద్దు

మత్స్యకార సంఘాలకు ఊరట


సర్వేపల్లి రిజర్వాయర్ (ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 16 : మత్స్యకారుల హక్కులను కాలరాస్తూ కేవలం తమ పార్టీ నాయకులకు చెరువులు, రిజర్వాయర్లపై ఆధిపత్యం కల్పించేందుకు గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జీవోను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. చెరువులు, రిజర్వాయర్లపై స్థానికంగా ఉంటున్న మత్స్యకార సహకార సంఘాలకే తిరిగి హక్కులను కల్పించింది. అంతేకాకుండా రాయితీ పథకాలను తిరిగి పునరుద్ధరి స్తామని కొత్త ప్రభుత్వం ప్రకటించ డంతో మత్స్యకారుల్లో సంతోషం నెలకొంది.

● అన్నీ వైసీపీ నాయకులకే..

100 హెక్టార్లు పైబడి విస్తీర్ణం కలిగిన చెరువులు, జలాశయాల్లో చేపల పెంపకం కోసం ఆన్‌లైన్ వేలం నిర్వహించడం వల్ల అధిక ఆదాయం వస్తుందంటూ వైసీపీ ప్రభుత్వం 217 జీవోను తీసుకొచ్చింది. దీనికోసం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద కోవూరు నియోజకవర్గంలో 3, కావలిలో 10, ఉదయగిరిలో 4, సర్వేపల్లిలో 3, వెంకటగిరిలో 3, గూడూరులో 1 చొప్పున మొత్తం 27 చెరువులు, జలాశయాలను ఎంపిక చేసింది. అందులో చేపల పెంపకం కోసం ఆన్‌లైన్ వేలం కూడా నిర్వహించింది. అయితే పేరుకే బహిరంగ వేలం నిర్వహించి మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలిగేలా అన్ని చెరువులు వైసీపీ నాయకులకే కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి. దీంతో మత్స్యకార సహకార సంఘాల నాయకులు జీవోను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపారు. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జీవో రద్దుకు హామీ ఇచ్చింది. దీంతో అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.

● 90శాతం వరకు రాయితీ

గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల వలల కొనుగోలుకు 60 శాతం నుంచి 90 శాతం వరకు, బోట్లు, మోటార్లు, రవాణా వాహనాలకు కూడా రాయితీ ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయితీలు తగ్గించింది. ఫిష్ ఆంధ్రా పేరుతో హడావుడి చేయడం తప్ప మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దగా చేసిందేమీలేదు. గతంలో అందుతున్న రాయితీలను సైతం తగ్గించి వారిని ఆర్థికంగా నష్టపరిచింది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను సైతం పక్కదారి పట్టించిందన్న విమర్శలు ఉన్నాయి.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం



చెరువులు, జలాశయాల్లో చేపల పెంపకానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మత్స్యకార సహకార సంఘాల పర్యవేక్షణలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకాలకు రాయితీలు కూడా అందించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో పాత పద్ధతిలో బహిరంగ వేలం జరుపుతాం.

- నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ.

భద్రతకు ఏదీ భరోసా ?

ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో కానరాని పేషెంట్ సేఫ్టీ ● 'ఆరోగ్యశ్రీ' మాటున కొంతమంది నుంచి వసూళ్లు



నేడు ప్రపంచ రోగి భద్రత దినోత్సవం

నెల్లూరు(వైద్యం)సెప్టెంబరు 16: రోగి భద్రతపై పలు సందేహాలు ఉన్నాయి. ప్రత్యేకించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి భద్రతపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులకైతే వైద్యులు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు, 52 పీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీలు జిల్లాలో ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ఇంతటి నెట్‌వర్క్ ఉన్నా, ఆసుపత్రుల్లో ఆశించిన స్థాయిలో రోగుల ఆరోగ్య భద్రత లేదు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సెప్టెంబరు 17న ప్రపంచ రోగి భద్రత దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. రోగి భద్రత దృష్ట్యా వ్యాధులపై అవగాహన కలిగించాలని, మెరుగైన చికిత్సలు అందించాలని పిలుపునిచ్చింది.

● జీజీహెచ్‌లో భద్రత కరువు

నెల్లూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 550 మంది వరకు ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతుంటారు. అయితే ఇక్కడ గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు అందుతుండగా మిగిలిన రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐసీయూలో 36 పడకలు ఉండగా అక్కడ కూడా రోగుల వైద్యచికిత్సలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ముందుగా జీజీహెచ్‌కి పంపిస్తుంటారు. అయితే ఇక్కడ ఒక్కరు మాత్రమే న్యూరాలజిస్టు ఉన్నారు. దీంతో వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి పంపించాల్సి వస్తున్నది. గుండె వైద్య నిపుణులు కూడా మరో కారణంగా చెప్పవచ్చు. జీజీహెచ్‌లో ప్రతినెలా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయంటే అక్కడ మెరుగైన వైద్య చికిత్సలు అందకపోవటమేనన్న విమర్శలు లేకపోలేదు. ఏటా వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ. 25 కోట్లు ఖర్చు చేస్తున్నా రోగి భద్రతకు ఢోకా ఉండటంలేదు.

● మందుల్లోనూ మాయాజాలం

రోగులకు అందించే మందుల విషయంలో కొందరు వైద్యులు ఆయా మందుల కంపెనీలతో కలిసి నాసిరకంవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా వ్యాప్తంగా 500కు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో 100కు పైగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయి. అయితే వీటిలో వినియోగించే మందుల్లో చాలావరకు వ్యాధిని త్వరగా తగ్గించే వీలులేదు. కొన్ని మందులైతే ఆ వ్యాధులకు పూర్తిగా పనిచేయవు. ఈ పరిస్థితిలో రోగి ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకరంగా మారింది. ఈ ఆసుపత్రులకు ప్రతిరోజూ 10వేల మందికిపైగా రోగులు వస్తుంటారు. అయితే ఇందులో కొన్ని ఆసుపత్రులలోనే రోగులకు సరైన చికిత్సలు అందుతున్నాయి.

● ఆరోగ్యశ్రీలోనూ తప్పని పాట్లు

ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్యసేవ) పథకం ద్వారా ప్రభుత్వం ఉచిత చికిత్సలు అందిస్తుంది. జిల్లాలో 71 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో ఏటా 50వేల చికిత్సలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ కింద రూ. 120 కోట్లు చెల్లిస్తుంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందాలంటే కొంత మొత్తం చెల్లించక తప్పదంటూ వైద్యులు చెబుతున్నారు. చేసేది లేక వైద్యులు చెప్పిన అదనపు మొత్తం చెల్లిస్తున్నారు. దీంతో రోగి భద్రతకు ఆర్థిక భారం తప్పటం లేదు.

రోగి భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం



జీజీహెచ్‌లో రోగుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తు న్నాం. స్పెషాలిటీ వైద్యులను కూడా నియమిస్తున్నాం. ఆసుపత్రికి వచ్చే వారంతా పేదవారే. ఈ స్థితిలో రోగి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. ప్రసూతి విభాగంతో పాటు అన్ని రకాల వ్యాధులకు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నాం. అయితే రోగి భద్రతలో కొన్ని సమస్య లు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తున్నాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత ఏదీ ?



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇటీవల ఓ రోగిని జీజీహెచ్‌కు తీసుకువెళ్లాం అక్కడ వైద్యులు సరిగ్గా చూడలేదు. కనీస చికత్సలు అందించేందుకు కూడా ససేమిరా అన్నారు. విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి ఆరోగ్య భద్రతపై నమ్మకం కలిగించాలి. తద్వారా ఎంతో మంది పేదరోగులు చికిత్సలు పొందుతారు.

- వెంకటేశ్వర్లు, రోగి సహాయకుడు

బాణాసంచా పేలుళ్లలో బాలుడి మృతి

● చికిత్స పొందుతున్న ఏడుగురు క్షతగాత్రులు
● ప్రమాదంలో దెబ్బతిన్న ఆరిళ్లు
● స్వల్ప గాయాలతో అల్లాడుతున్న 15మంది
● బాధితులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ
● కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు


పేలుళ్లు దాటికి పడిపోయిన ప్రహరీగోడ


ప్రమాదంలో మృతి చెందిన ఉమామహేష్ (ఫైల్)

మనుబోలు, సెప్టెంబరు 16: స్థానిక బీసీ కాలనీలో ఆదివారం రాత్రి బాణాసంచా పేలుళ్లలో తీవ్రంగా గాయపడిన కందలి ఉమామహేష్ (12)సోమవారం వేకువన మృతిచెందాడు. పేలుళ్ల అనంతరం జనం గాయాలతో చెల్లాచెదరవడంతో అక్కడికి సీఐలు రాంబాబు, వేమారెడ్డి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న గణేశ్ విగ్రహాన్ని తరలించారు. జిల్లా వైద్యాధికారులు ఆదేశాల మేరకు మనుబోలు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది కాలనీలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు గేయపూజిత క్షతగాత్రులను పరీక్షించి మందులు ఇచ్చారు.

● గాయపడిన బాధితులు వీరే..

ఈ ప్రమాదంలో గాయపడినవారిలో గోవిందయ్య, కావేటి జయమ్మ, కావేటి పెంచలయ్య, తాళ్ల నాగరాజు, దీపిక, కంద్రాతి నిర్మలమ్మ, కావేటి పెంచలయ్య, చలగల సునీత, శ్రీనువాసులు, వెంకటేష్, మాన్విత్‌సిద్దు, గిరీష్, యామిని, గౌతమి, కొమరాల హరిత, కంద్రాతి అంకయ్య, స్వాతి, కొమరాల జ్యోతి, పరమేశ్వరి, మోమిడి లోకేష్, కందళ్ల పెంచలమ్మ, జూపల్లి చరిష్మ ఉన్నారు. వీరంతా స్వల్ప గాయాలతో మంచానపడి ఆవేదన చెందుతున్నారు. కాగా మరో ఏడుగురు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.


పేలుళ్లు జరిగిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డికి చూపుతున్న సీఐ రాంబాబు

● మామ ఇంటికి వచ్చి బాలుడి మృతి

పేలుళ్ల ప్రమాదంలో బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన కందలి ఉమామహేష్(12) మరణించాడు. పేలుళ్ల ప్రదేశానికి అతి సమీపంలో మహేష్ ఉండడంతో పొట్టకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్సకు గూడూరు తరలించి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైకి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. గణేశ్ నిమజ్జనం చూసేందుకు మహేష్ బీసీ కాలనీలో ఉంటున్న మామ కంద్రాతి శంకర్ ఇంటికి వచ్చాడు. శంకర్ కుటుంబం లోనే ఆరుగురు గాయపడ్డారు. దీంతో శంకర్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నా డు. మృతుడు మహేష్ పిగిలాంలో 8వతరగతి చదువుచున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడం తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చింది.

● పేలుళ్లు జరగడం దురదృష్టకరం

గణేశ్ ఉత్సవాల్లో బాణాసంచా పేలుళ్లు జరగడం దురదృష్టకరమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బీసీ కాలనీలోని పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. గాయాలతో బాధపడుతున్నవారిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ సంబరాలు చేసుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి జరగకుండా మిగతావారు అప్రమత్తం కావాలన్నారు. బాలుడు కుటుంబాన్ని ఆదుకునే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే క్షతగాత్రులకు సాయం అందించే విషయంలో కూడా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సురేష్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణయ్య, మధునాయుడు, సాని వెంకటరమణయ్య, చల్లగిరి ప్రసాద్, పచ్చిపాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా బాధితులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా పరామర్శించారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

విద్యార్థి అదృశ్యంపై ఆందోళన



మాట్లాడుతున్న విద్యార్థి తల్లిదండ్రులు

కావలి, సెప్టెంబరు 16: స్థానిక అరుంధతీయవాడకు చెందిన గౌడుపేరు మహేష్ అనే విద్యార్థి ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించటం లేదని వారి తల్లిదండ్రులు చిన్నయ్య, శిరీషలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం వారు కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మాట్లాడారు. పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తమ కుమారుడు స్కూల్‌కు ఎందుకు వెళ్లలేదని మందలించటంతో అప్పటి నుంచి కనిపించకుండా పోయారన్నారు. తమ బిడ్డ ఆచూకీ ఎక్కడైనా ఉంటే తమకు తెలపాలని వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాల బయట రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌లో ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి మున్సిపాలిటీ, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అనాథ వృద్ధుడిగా స్థానికులు భావిస్తున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

ఉలవపాడు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సోమవారం వేకువజామున స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ అం కమ్మ తెలిపిన వివరాల మేరకు.. మన్నేరువాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. 6 ట్రాక్టర్లలో రెండు ట్రాక్టర్లకు ఇసుకతో నింపి ఉండగా మరో నాలు గు ట్రాక్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఇసుక నింపిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఖాళీ ట్రాక్టర్ల యజమానులకు తొలి తప్పుగా కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరికలతో పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. నెల్లూరుపాళెంసెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వాసిలి వైపు నుంచి వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లకు ఎటువంటి బిల్లులు లేకపోవడంతో అక్రమ రవాణాగా భావించి సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కందుకూరు : జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి బ్యూలా గ్రేస్ ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు అర్బన్‌లో 15,618 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉదయగిరి రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం విద్యార్థులకు నులి పురు గులు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6-19 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-5 ఏళ్లలోపు చిన్నారులకు మధ్యాహ్న భోజనం అనంతరం అల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు మింగించడం జరుగు తుందన్నారు. మండలంలో 9,216 మందికి మాత్రలు మింగించడమే లక్ష్యమన్నారు.

బావిలో పూడిక తీయించండి



వాడుకలో లేని చేదుడు బావి

లింగసముద్రం : తిమ్మారెడ్డిపాలెం చెరువు సమీపంలోని చేదుడుబావిలో పూడికను తీయించి వాడుకలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. 10ఏళ్ల నుంచి ఈ బావి వాడుకలో లేదన్నారు. అంతకుముందు గ్రామ ప్రజలు ఈ బావిలోని నీటిని తాగేవారని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌ఓ ప్లాంటు నీరు తాగి కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులతో బాధలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్లకు మరమ్మతులు చేయాలి



మరమ్మతులకు గురై మూలనపడ్డ చేతిబోరు

వింజమూరు : పట్టణంలో, మండలంలో పనిచేయని చేతి బోర్లకు మరమ్మతులు చేసి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు సరిపోవడంలేదని, ఆ నీరు ఎప్పుడు వస్తుందో తెలియడంలేదన్నారు. కరెంటు లేకపోతే నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపులైతే కరెంటుతో సంబంధం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు నీరు పట్టుకోవచ్చని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపులను వాడుకలోకి తీసుకుస్తే కొంతైనా నీటి సమస్య నుంచి బయటపడవచ్చని అంటున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

● శాంతి, సన్మార్గం.. ప్రవక్త మార్గం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



ఉదయగిరి రూరల్ : కేక్ కట్ చేస్తున్న మతపెద్దలు



కావలిటౌన్: ముస్లింలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, సెప్టెంబరు 16: మానవాళి సన్మార్గం వైపు నడిచినపుడే ప్రపంచ శాంతి సాధ్యం అవుతుందని, దివ్య ఖురాన్ బోధనలతో మానవళిని ప్రభావితం చేసిన మహోన్నతులు మహమ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే డి.కృష్ణారెడ్డి తెలిపారు. మిలాదున్నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ ముస్లింలు పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. జెండా చెట్టు వద్ద నుంచి వారు పెద్దఎత్తున జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రవక్త మార్గం ఆచరణీయమని ఆయన బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. ట్రంకురోడ్డులో జరిగిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ మధుబాబు నాయుడు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సఫ్దార్ కిర్మాణీ, అన్సర్, ఖమర్‌బాబు, హజరత్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 16: మహమ్మద్ ప్రవక్త జయంతి సంద ర్భంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా పట్టణంలోని చిన్న, పెద్ద మసీదులతోపాటు అస్థాన-ఏ, ఖాదరి యా దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి భారీ కేక్‌లు కట్ చేశారు. అనంతరం పట్ట ణంలో శాంతి ర్యాలీ చేపట్టారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



చేజర్ల: జామియా మసీదు వద్ద అన్నదానం చేస్తున్న ముస్లింలు

●**చేజర్ల:** మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను సోమవారం మండలంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. చేజర్ల జామీయా మసీదు మతవల్లి కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌సాహెబ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

●**ఏఎస్ పేట:** మండలంలోని ఏఎస్ పేటతో పాటు రాజవోలు, హసనాపురం, గుంపర్లపాడు తదితర గ్రామాలలో సోమవారం మిలాదున్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్ పేట దర్గా సెంటర్ నుండి నగర ఖానా సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా నిషాన్ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిప్ప మీద బురుజు వద్ద జెండాను ఆవిష్కరించారు. ప్రార్థనలు చేశారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** నందిపాడు, నర్రవాడ, ఏరుకొల్లు, వెంకటంపేట గ్రామాలతోపాటు దుత్తలూరులో మిలాద్-ఉన్-నబీ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముస్లింలు మసీదులు, దర్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ సందేశమిచ్చి మిఠాయిలు పంచిపెట్టారు.

●**జలదంకి:** మండలంలో ముస్లింలు సోమవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జలదంకి, గట్టుపల్లి, బీకెఅగ్రహారం, చినక్రాక, అన్నవరం, జమ్మలపాలెం, క్రిష్ణాపాడు, సోమవరప్పాడు, చోడవరంలో గ్రామాల్లో కూడా ఈ వేడుకలను జరుపుకున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు పెంచలయ్య

కావలి, సెప్టెంబరు 16: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ పతాకాన్ని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వం పెంచుకోవాలన్నారు. యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. అన ంతరం రీజినల్ సెంటర్ నెల్లూరులో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కావలి డి పోకు చెందిన 10మంది యూనియన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్ర మంలో యూనియన్ నాయకులు వెంకయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కాలేషా, రోశయ్య, ఎంఏ బేగ్, ఎస్‌కేఎం బాష, రాజు, ప్రసాద్ శ్రీను, మనోహర్ ఉన్నారు.

ప్రభుత్వ స్టాఫ్ నర్సులుగా గుర్తించాలి

కావలి, సెప్టెంబరు16: తమను ప్రభుత్వ స్టాఫ్ నర్సులుగా గుర్తించాలని కావలి ఏరియా వైద్యశాలలోని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌గా 'సెబ్ '



నూతన బోర్డు వద్ద ఎక్సైజ్ సిబ్బంది

కలిగిరి, సెప్టెంబరు 16: స్థానిక సర్కిల్ పరిధిలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోస్టేషన్ (సెబ్)ను ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ నెంబర్ 188 ప్రకారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసిన నేపథ్యంలో సోమవారం 'సెబ్' పేరున ఉన్న బోర్డు తొలగించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారా వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలపై సెల్:94409 02523 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

పైపులైన్లకు కనెక్షన్ ఇవ్వరా ?

● నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు



శింగరపాలెం ఎస్సీ కాలనీలో నిర్మించిన మంచినీటి ట్యాంకు

లింగసముద్రం, సెప్టెంబరు 16: తిమ్మారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని శింగరపాలెంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏడాది క్రితం అధికారులు రూ. 31.60లక్షలతో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న మంచినీటి ట్యాంకు నిర్మించారు. తాగునీటిని సర ఫరా చేసే పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇవ్వక పోవడంతో నీటి సరఫరా కావడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.10లక్షలతో ట్యాంకు నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. రెండు నెలల కిందట అధికారులు ఈ ట్యాంకు నుంచి పైపులైన్లకు నీటి విడుదల చేసి పరీక్షించారు. ఈ పైపులైన్‌కు ఇప్పటి వరకు నీటిని సరఫరా చేయడం లేదని శింగరపాలెం ప్రజలు వాపోతున్నారు. మరోపక్క వెంగళాపురం మంచినీటి ట్యాంకు నుంచి శింగరపాలెం గ్రామానికి తాగు నీరు సరఫరా చేస్తుండడంతో తమ గ్రామంలోని కొన్ని బజార్లకు నీరు కావడం లేదని వెంగళాపురం గ్రామస్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా వారు స్పందించి రెండు గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేవతామూర్తులకు పంచలోహ కిరీటాలు



ఆలయ వ్యవస్థాపకుడికి కిరీటాలు అందజేస్తున్న బీఎన్ భానుసింగ్

చిత్రగుంట, సెప్టెంబరు 16: విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాలెంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి, విఘ్నేశ్వర, సుబ్రహ్మణేశ్వర స్వాములకు సోమవారం రైల్వే రిటైర్డ్ డ్రైవర్ బీఎన్ భానుసింగ్ పంచలోహ కిరీటాలను బహూకరించారు. వీటిని ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు తమ్మవజ్జుల విజయ్ పవన్‌కుమార్ శర్మ శుద్ధి కార్యక్రమం, ప్రత్యేక పూజలు చేశారు.

'చలో విజయవాడ' విజయవంతం చేయండి

సీతారామపురం, సెప్టెంబరు 16 : ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న డాక్టర్లకి ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 85కి వ్యతిరేకంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సి డాక్టర్ స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేని కారణంగా ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఏపిపిహెచ్‌సి డిఎ యూనియన్ పిలుపు మేరకు మంగళవారం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని యూనియన్ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అంతేకాకుండా పీహెచ్‌సిలో సేవలు నిలవనున్నాయని ఆమె తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, సెప్టెంబరు 16: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఎదురు భవనంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వీరితో పాటు పారిశ్రామికవేత్త బెల్లం జయంత్‌బాబు, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవి ప్రకాష్ పాల్గొంటారని పేర్కొ న్నారు.

వీధికో బెల్టు షాపు

● విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16: మండలంలో మద్యం ఏరులై పారుతోంది. పోలినేనిచెరువు గ్రామం మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో వీధికో బెల్ట్ షాపు ఏర్పాటుచేసి నివాసగృహాలు, బడ్డీకొట్టు, కిరాణా షాపుల్లో మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని వలేటివారిపాలెంలో 2, పోకూరులో ఒక ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్ట్‌షాపులు సుమారు 150కి పైగా ఉన్నాయి. వీటిలో 24 గంటలూ మద్యం అధిక ధరకు లభ్యమవుతోంది. కాగా, బెల్టుషాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగానే బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, చేపలు ఆమ్లేట్ కూల్‌డ్రింక్స్ తదితర ఆహారపదార్థాలు వండి అందజేస్తున్నారు. కాగా, అంకభూపాలపురంలో ఏకంగా బెల్టుషాపు ఏర్పాటుకు బహిరంగంగా వేలం పెట్టి షాపు నిర్వహిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు సన్మానం



అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులు

వింజమూరు, సెప్టెంబరు 16: పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపంలో సోమవారం ఉదయగిరి నియోజకవర్గం ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గం అధ్యక్షుడు కేవీ రత్నం అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవార్డులు అందచేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరుజిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, వింజమూరు ఎంఈవో శ్రీధర్, కలిగిరి ఎంఈవో రమేష్, సురేష్, జిల్లా సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, ట్రెజరర్ కృష్ణారావు, నియోజకవర్గ సెక్రటరీ ఉదయ్‌శంకర్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గాంధీనగర్ - చుండి రోడ్డు పనులు

● ప్రజలు, వాహనదారుల అవస్థలు



అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16: మండలంలోని గాంధీనగర్ - చుండి రోడ్డు నిర్మాణ పనులు అంసపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గాంధీనగర్ నుండి అమ్మపాలెం, కాకర్లవారిపాలెం మీదుగా చుండి జాతీయ రహదారి వరకు సుమారు 6.34 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మాణానికి నాబార్డు పథకం నుం చి రూ.2.2కోట్ల నిధులు గత వైసీపీ ప్రభు త్వ హయంలో మంజూరయ్యాయి. అప్పట్లో టెండ ర్లు పిలిచారు. కందుకూరు మండలం పందల పాడు గ్రామానికి చెదిన రామాల వెంకట కృష్ణారెడ్డి పనులు దక్కించుకున్నాడు. పనులను అమ్మపాలెం వరికూటి సంజీవ్‌రెడ్డి సబ్ కాంట్రాక్టర్‌గా తీసుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించారు. గాంధీనగర్ నుండి చుండి వరకు రోడ్డుకు రెండు వైపులా సైడ్ బర్మ్ మట్టి పనులు పూర్తి గ్రావెల్ వేయలేదు. వాటర్ క్యూరింగ్ చేయ లేదు.. రోలింగ్ చేయలేదు. అప్పటినుంచి ఇప్పటివరకు పనులు ముందకు సాగలేదు. రోడ్డుంతా కంకర రాళ్లు తేలాయి. నెల్లూరు, కావలి, కలిగిరి కొండాపురం, లింగసముద్రం, గాంధీనగర్, అమ్మపాలెం కాకర్లవారిపాలెం ప్రాంతాల ప్రజలు ప్రతి శనివారం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి ఈ రోడ్డుపై వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ తారురోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా వినాయక నిమజ్జనం



గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, సెప్టెంబరు 16: కలుగోళమ్మశాంభవి ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం నిమజ్జన గ్రామోత్సవం అట్టహాసంగా చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పా ల్గొని పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. ట్రంకురోడ్డు మీదుగా ముసునూరు మందాటి చెరువు వరకు సాగిన వేడుకలో మహిళలు, యువత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే నగల రికవరీ

● ఇంటూరికి బంగారు వ్యాపారుల సన్మానం



ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న బంగారు వ్యాపారస్తులు

కందుకూరు, సెప్టెంబరు 16: ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తమకు ఇచ్చిన హామీ మేరకు అండగా నిలిచారని పట్టణంలోని బంగారు నగల వ్యాపారులు తెలిపారు. ఇటీవల స్థానిక పెద్దబజారులోని గాయత్రీ జ్యువెలర్ షాపులో దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. స్థానిక పోలీ సులు 24గంటల్లోపు సంబంధిత దొంగలను పట్టుకుని నగలు రికవరీ చేయించి కేసు పెట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చూపించన చొరవ మరువలేనిదన్నారు. సోమవారం కార్యాలయంలో ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినగల దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని విలువైన వస్తువులను కాపాడుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, తుమ్మపూడి సురేష్, కాకుమాని బ్రహ్మయ్య, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్, వేముల సుకుమార్ గుప్తా పాల్గొన్నారు.

గ్రామకొలను పనుల ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి : స్థానిక పెద్ద చెరువును గ్రామ కొలనుగా మార్చేం దుకు వైసీపీ నాయకులు కొంతమేర పనులు చేసి అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ పనులు పూర్తి చేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శ్రీకారం చుట్టారు. కలిగిరి పెద్ద చెరువు వద్ద శిలాఫలకం ఆవిష్కరించి పనులు పునఃప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కలిగిరి పెద్దచెరువును గ్రామకొలనుగా తీర్చిదిద్దేందుకు రూ.2.15కోట్లు నిధులు మంజూరు కాగా కేవలం రూ.50లక్షల మేర మట్టి పనులు చేసి నిలిపి నిలిపివేశారని చెప్పారు. తెలుగు దేశం ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో పనులు చేసి ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా గ్రామకొలను నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది తమకు వసతి చూపించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్థానిక పీహెచ్‌సీలో వసతి కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, చీమల తాతయ్య, రైతు నరేంద్ర, స్వర్ణ కొండయ్య, కొప్పోలు కొండలరావు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లతీఫున్నీసా

జలదంకి : వాహనదారులు ట్రాఫిక్ నిభందనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని జలదంకి ఎస్‌ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ క్రమబద్ధీకరణలో భాగంగా సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ఆమె ఆటోడ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ మంజూరు చేసే డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడకూడదన్నారు. మైనర్ పిల్లలకు మోటార్‌బైక్‌లు, ట్రాక్టర్లు ఇచ్చి రోడ్లపై నడిపిస్తే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రతి వాహనదారుడు తప్పక గుర్తించాలన్నారు. ప్రతిరోజూ ఈ విషయంపై జలదంకి పోలీసు సిబ్బంది విధిగా రోడ్లపై తనిఖీలు చేపడతారన్నారు. అధికస్పీడుతో వాహనాలు నడిపినా.. ఓవర్‌లోడ్‌తో ప్రయాణికులు తరలించినా చర్యలు తప్పవన్నారు.

వరద బాధితులకు సాయిపేట వాసుల సాయం



వరద బాధితులకు సాయం అందచేస్తున్న సాయిపేట వాసులు

కొండాపురం : సాయిపేట గ్రామానికి చెందిన యువత స్థానిక పంచాయతీ అభివృద్ధి వేదిక సభ్యుల ఆధ్వర్యంలో విజయవాడలోని 250 వరద బాధిత కుటుంబాలకు సోమవారం సాయం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు చేతుల మీదుగా ఆ శాఖ నెల్లూరు జిల్లా కార్యదర్శి మోహన్, సాయిపేట గ్రామస్థులు భీమిరెడ్డి అరుణ, తాటికొండ ప్రవీణ్ బియ్యం. నిత్యావసర సరుకుల కిట్లను అజిత్‌సింగ్ నగర్, వాంబేకాలనీ, ప్రకాష్‌నగర్, శాంతినగర్, ప్రజాశక్తినగర్ ప్రాంతాల కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంటా శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌భాషా, తలసిరి ప్రభాకర్, షేక్ జిలానీ, ఎమ్.ప్రవీణ్, కొమ్మి వెంకటేశ్వర్లు, షేక్ అమీర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వింజమూరు : గర్భిణులు పౌష్టి కాహారం తీసుకోవాలని సీ డీపీవో పద్మజాకుమారి సూచించారు. మండల పరిధి లోని నేరుడుపల్లి అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వ హించారు. గర్భిణులకు పాలు, గుడ్లు, అరటిపండ్లు, చిక్కీలు ఇస్తున్నట్లు సీడీపీవో పేర్కొన్నారు. అలాగే చిరుధాన్యాల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్త లీలావతి, ఆశా వలంటీర్లు అరుణ, ఏఎన్ఎం విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జనని, హెల్త్ ఎడ్యుకేటర్ గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

దండుకున్నది చాలు..

ఇక వెళ్లిపోదాం!



రూరల్ తహసీల్దారు కార్యాలయం

"అంతా నేను చూసుకుంటా.. ఎకరానికి రూ.50 వేలివ్వు.. నీ ఐదెకరాలకు పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించే బాధ్యతనాది..!, రీ సర్వే తరువాత రికార్డులన్నీ మారిపోయాయి.. తాజాగా నీ పేరు రికార్డుల్లో ఎక్కిస్తా, ఒక రూ.20 వేలు పంపు.. సర్వే చేసినప్పుడు నీ పొలంలో బాట చూపిస్తోంది ఆఫీసులో చెప్పి అదిలేకుండా చేస్తా ఒక లక్ష రూపాయలు కొట్టు..!" అంటూ నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో రైతుల నుంచి వీఆర్వోలు భారీగా వసూళ్లు చేశారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలో స్థానిక వైసీపీ నాయకులనే ఏజెంట్లుగా పెట్టుకుని వీఆర్వోలు విచ్చలవిడిగా సాగించిన దందా ఇది. అయితే ప్రభుత్వం సర్వర్లను ఆపేయడం, ఎన్నికల సీజన్ మొదలవడంతో వీఆర్వోలు రైతులకు పని చేయలేదు, తీసుకున్న డబ్బులు తిరిగివ్వలేదు. తాజాగా వారంతా సాధారణ బదిలీల జాబితాల్లో ఉండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

- వీఆర్వోల విచ్చలవిడి వసూళ్లు
- పాసుపుస్తకం, అడంగళ్ మార్పునకు రూ.లక్షల స్వాహా
- తాజా బదిలీలతో తప్పించుకునేందుకు వ్యూహం
- ఆందోళనలో నెల్లూరు రూరల్ మండల రైతులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 16 : నెల్లూరుకి పడమరనున్న ఓ పెద్దగ్రామంలోని ఓ వీఆర్వో పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగళ్‌లో పేర్లు మార్పు, ప్రభుత్వ పోరంబోకు భూములకు ప్రైవేట్ సర్వే నెంబర్లతో పట్టాపుస్తకాలు ఇప్పిస్తానని ఏకంగా రూ.30 లక్షలకుపైగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా పని చేయకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. పైగా రైతులు నిలదీస్తున్నారని గ్రామానికి వెళ్లడం కూడా మానేశాడు. ఈ గ్రామానికి 7 కి.మీ దూరానున్న మరొక గ్రామ వీఆర్వో ఓ పెద్దరైతు పొలం రీసర్వేలో బాట చూపుతోందని, దానిని తీయాలంటూ తహసీల్దారు ఆఫీసుకు రూ.లక్ష చెల్లించాలని వసూలు చేశాడు. ఇక్కడ కూడా పని జరగలేదు.. డబ్బులు తిరిగివ్వలేదు. ఈ ప్రాంతంలోని ఒకే పేరుతో వచ్చే రెండు గ్రామాల్లో జగన్ ప్రభుత్వంలో పట్టాపుస్తకాల జారీకి ఎకరాకి రూ.10 వేలు వసూలు చేయగా స్థానిక గ్రామపెద్దలు జోక్యం చేసుకోవడంతో సదరు వీఆర్వో నగదు తిరిగిచ్చేశారు. నరసింహకొండకు సమీపానున్న మరొక గ్రామంలో సర్వేయర్‌తో కలిసి వీఆర్వో రీ సర్వే సర్టిఫికెట్ల పేరిట రూ.లక్షలు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు

వీఆర్వోలు రైతుల వద్ద డబ్బు వసూలు చేసిన విషయం నాకు తెలియదు. నేను కొత్తగా వచ్చాను. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే శాఖాపరంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ సేవలకు ఎవరూ డబ్బు ఇవ్వనవసరం లేదు.

\- లాజరస్, రూరల్ తహసీల్దారు

● మౌనంగా ఉన్నందుకు రూ.లక్షలు

నెల్లూరు నగరానికి తూర్పునున్న గ్రామాల్లో విచ్చలవిడిగా ఆవిర్భవించిన రియల్ వెంచర్లలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్థానిక వీఆర్వోలు మౌనంగా ఉన్నందుకు సదరు వ్యాపారులు రూ.లక్షలు కుమ్మరించారు. ఈ గ్రామాలన్నింటిలో ఖరీదైన భూములుండటంతో కాలువ, రోడ్డు, పంచాయతీ, చెరువు పోరంబోకు భూములను రియల్టర్లు వారి వెంచర్లలో కలిపేసుకుని ప్లాట్లు నిర్మించారు. రూ.కోట్లు విలువ చేసే భూములు కళ్లముందు అన్యాక్రాంతమవుతున్నా నోరుమెదపకుండా కళ్లు మూసుకున్నందుకు వీఆర్వోలు రూ.లక్షలు అర్జించారు. ఇటు పడమర, అటు తూర్పు గ్రామాల్లోని వీఆర్వోలు పోటీపడి సాగించిన వసూళ్ల పర్వంలో అప్పటి ఆర్ఐ, తహసీల్దార్ల భాగస్వామ్యం కూడా ఉన్నట్లు విమర్శలున్నాయి.

● బదిలీల సాకుతో తప్పించుకునే వ్యూహం

రైతుల నుంచి రూ.లక్షలు దండిన వీఆర్వోలు, ప్రభుత్వ భూములను కబ్జాదారుల చేతికందించిన వీఆర్వోలు వాటివల్ల ఎదురయ్యే సమస్యల నుంచి తప్పించుకునేందుకు తాజాగా జరుగుతున్న సాధారణ బదిలీలను అడ్డం పెట్టుకుంటున్నారు. తమకు బదిలీ సమయం అయిందని, మరొక ప్రాంతానికి బదిలీ చేయాలని వారే స్వయంగా ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులను కోరుతున్నారు. ఈ తంతును గమనించిన బాధిత రైతులు తమ వద్ద వసూలు చేసిన డబ్బులు ఇవ్వక, పని చేయక బదిలీపై వెళ్లిపోతున్నారంటూ ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రజల కోసం పని చేయండి

● టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లకు ఎమ్మెల్యే పిలుపు



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 16 : పార్టీ అధికారంలో ఉందని విర్రవీగకుండా ప్రజల్లో ఉండి ప్రజల కోసం పని చేయాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో 1, 2 డివిజన్ల కార్పొరేటర్లు జానా నాగరాజు, పడిగినేటి రామ్మోహన్‌లు తమ కార్యకర్తలతో, వైసీపీ 32, 33 డివిజన్ల ఇన్‌చార్జి మేఘనాథ్‌సింగ్ మిత్ర బృందం, వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, వారి మిత్రబృందం టీడీపీలో చేరారు. వీరిని సాదరంగా ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే మనమంతా మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా తోడ్పాటునివ్వాలన్నారు. మళ్లీ మనం అధికారంలోకి వచ్చేందుకు ఇప్పట్నుంచే పునాదులు వేసుకోవాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అటు సర్పంచు, ఇటు కార్పొరేటర్లు స్వీప్ చేసి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, శివరామయ్య, జలదంకి సుధాకర్, మన్నేపల్లి రఘు, మన్నెం పెంచలనాయుడు, హజరత్‌నాయుడు, కుల్లూరి రాఘవేంద్ర పాల్గొన్నారు.

విలీన ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వండి

● మంత్రి నారాయణను కోరిన గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 16 : రూరల్ నియోజకవర్గం నుంచి కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ విలీనమైన 8 మున్సిపల్ డివిజన్లలో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు వంటి కనీస మౌలిక సదుపాయాల సమకూర్చేందుకు ప్రత్యేక నిధి కేటాయించాలని కోరారు. బీసీ భవన్, క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

'ఇందుకూరుపేటలో క్షీణించిన శాంతిభద్రతలు'

ఇందుకూరుపేట, సెప్టెంబరు 16: మండలంలో శాంతిభద్రతలు క్షీణించాయని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైపాడు బీచ్‌లో ఆదివారం వినాయక నిమజ్జనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరైనా, పోలీసులు బందోబస్తు సరిగా నిర్వహించలేకపోయారని పేర్కొన్నారు. కొత్తూరుకి చెందిన ముగ్గురు యువకులు సముద్రంలో కొట్టుకుపోతుండగా, అక్కడే ఉన్న స్థానికులు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారన్నారు. మైపాడు బీచ్‌లో పోలీసు అవుట్ పోస్టు ఉన్నా, విధుల్లో ఎవరూ ఉండరని పేర్కొన్నారు. ఇకనైనా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ స్పందించి మైపాడు సముద్రతీరంలో పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా గణనాథుడి గ్రామోత్సవం

ముత్తుకూరు, సెప్టెంబరు 16: మండలంలోని బ్రహ్మదేవంలో సోమవారం గణనాథుడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్థానిక టీడీపీ నాయకులు కొత్తపల్లి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నసంతర్పణ చేశారు. తదుపరి వినాయకుడిని గ్రామంలో ఊరేగించారు. తప్పెట్లు, తాళాలు, బాణసంచా మోతల మధ్య వినాయక విగ్రహాన్ని సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు.

బీమా పరిహారం పెంపు హర్షణీయం

కోవూరు, సెప్టెంబరు16: రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న బీమా పరిహారాన్ని రూ.10లక్షలకు పెంచడం హర్షణీయమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని చంద్రబాబు నాయుడు నెరవేర్చడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పంతంగి రాము, ఇంటూరి విజయ్, కలికి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 16: మండలంలోని వరిగొండలో సోమవారం త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి (నెల్లూరు కమిటీ) ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం జరిగింది. మూడు మతాల ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక గ్రంథాలను వారు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నెల్లూరు కమిటీ అధ్యక్షుడు కేవీ రత్నం, సభ్యులు ఎంసీ సుధాకర్‌ఆచారి, సీహెచ్ సునీల్, పీ ప్రదీప్, జీ పెంచలరత్నం, సీహెచ్. లక్ష్మయ్య, ఆర్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 16 : నగరంలోని దర్గామిట్ట హోటల్ సీజన్స్ ఇన్ పెన్నా రెస్టారెంట్‌లో సోమవారం నుంచి విభిన్న రకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ హోటల్ జనరల్ మేనేజర్ నాగూరుబాబు మాట్లాడుతూ తమ పెన్నా రెస్టారెంట్‌లో భోజన ప్రియులు విభిన్న రుచుల వంటకాలను రుచిచూసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సుమారు 35 వెజ్, నాన్‌వెజ్ వంటకాలు ఉన్నాయన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రాత్రి 7 నుంచి 10.30 గంటల వరకు అన్నీ అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కొరుటూరులో అన్నదానం

ఇందుకూరుపేట, సెప్టెంబరు 16: మండలంలోని కొరుటూరులో మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం ముస్లింలు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, పార్టీ నాయకులు, పలువురు ముస్లిం మతపెద్దలు, స్థానిక యువత పాల్గొన్నారు.

24 గంటలు వైద్యసేవలు శుభపరిణామం : సోమిరెడ్డి

పొదలకూరు, సెప్టెంబరు 16 : పట్టణంలో 8 మంది వైద్యులతో ఆసుపత్రి ఏర్పాటు చేయడం, అందులో 24 గంటలపాటు వైద్యసేవలు అందించడం శుభపరిణామమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కెనరా బ్యాంకు వద్ద డాక్టర్స్ క్లినిక్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి సంజయ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఏర్పాటు చేసిన వైద్యులు మురళీకృష్ణ, పద్మావతి, తులసీరామ్, వెంకటేశ్వర్లు, శ్రీరామ్, నిఖిల్‌తేజ, ఆదర్శ్ శివకృష్ణ, సుజితలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, బక్కయ్యనాయుడు, జమీర్, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోదూరు పెంచలభాస్కర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

● కొణతం కుటుంబానికి పరామర్శ

తోటపల్లిగూడూరు : టీడీపీ తిరుపతి పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి, నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు తల్లి పెంచలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం రఘుబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని దైవాన్ని ప్రార్థించారు. ఆయన వెంట పార్టీ నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాగుంట రమణారెడ్డి, అన్నం శ్రీనివాసులు, పాకం వెంకయ్య, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అంగన్‌వాడీల చేయూత



సేకరించిన దుస్తులతో అంగన్‌వాడీ సిబ్బంది

ముత్తుకూరు, సెప్టెంబరు 16 : విజయవాడ వరద బాధితులకు ముత్తుకూరు, టీపీ గూడూరు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది చేయూత నందించారు. తమ కేంద్రాల పరిధిలోని సిబ్బంది నుంచి విరాళాలు సేకరించడంతోపాటు చీరలు, దుప్పట్లు, ఇతర దుస్తులను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లారు. అక్కడి బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీపీఎం, సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సీతారాంకు ఘన నివాళి



ఏచూరి సీతారాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 16: మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏచూరి సీతారాం సంతాప సభ నిర్వహించి, ఆయనకు ఘన నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు చంద్ర రాజగోపాల్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతారాం మరణం సీపీఎంకే కాకుండా యావత్ భారత ప్రజానీకానికి తీరనిలోట న్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళ పుల్లయ్య, పెంచల నరసయ్య, సీఐటీయూ నేతలు బీ.మనోహర్, గుడి మణి, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జ్యోతి వినాయక మందిరం ఉత్సవాలు



నెల్లూరు(సాంస్కృతి కం), సెప్టెంబరు 16 : నగరంలోని పురమందిరం ప్రాంగణంలోని జ్యోతి వినాయక మందిరంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకారం, విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భకుత్లకు అన్నదానం చేశారు.

● గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ నగర్‌లో జరిగిన 23వ గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి హోమం, కుంకుమ పూజ, పుష్పాభిషేకం, దీపోత్సవం, నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం స్వామి వారికి శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను గణేష్ మిత్ర మండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్, సభ్యులు పర్యవేక్షించారు.

నాగాయగుంటకు బస్సు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 16: మండలంలోని నాగాయగుంట గ్రామానికి సోమవారం ఆర్టీసీ బస్సొచ్చింది. దీంతో గ్రామస్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు నాగాయగుంట, అనంతనారాయణపురం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారు. కాగా నాగాయగుంటకు బసొచ్చి 18 ఏళ్ల పై మాటేనని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

చౌకిచర్ల చెరువులో కబ్జా

వందల ఎకరాల ఆక్రమణ ● పట్టించుకోని అధికారులు

విడవలూరు, సెప్టెంబరు 16: చెరువులు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామ చెరువు సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కాలక్రమేణా అది కబ్జాకు గురైంది. ఈ చెరువులో రోజురోజుకి ఆక్రమణలు పెరుగుతున్నాయి. చెరువులో పూడికతీత చేపట్టకపోవడంతో 50 శాతం మేర పూడిపోయింది. దీంతో కొందమంది ఆక్రమణదారులు చెరువు లోతట్టు ప్రాంతాన్ని పంటపొలాలుగా మార్చేశారు. ఒకరిని చూసి మరొకరు చెరువుని ఆక్రమించుకుంటూ పోతున్నారు. దీంతో చెరువు కుంచుంచుకు పోయినీరు నిల్వ చేసుకునే వీలులేకుండా పోయింది. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందటం గగనంగా మారింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోతే చెరువు పూర్తిగా కనుమరుగుఅయ్యే పరిస్థితి నెలకొంది.



ఆక్రమణకు గురైన చౌకిచర్ల చెరువు

ఉపాధ్యాయుడికి సన్మానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 16 : ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, వెంకటేశ్వరపురం నగరపాలక ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ రాజమనోహర్‌ను సోమవారం మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు సన్మానించారు. నగరంలోని ఎన్‌జీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమం లో నేతలు మాట్లాడుతూ విద్యా రంగంలో విశేష సేవలందించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన రాజమనోహర్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎఫ్ నేతలు బీ.వెంగళ రావు, టీ.సురేష్‌బాబు, ఎస్‌కె.ఎండీ అబ్దుల్‌రహీమ్, ధనరాజ్, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడి దంపతులను సన్మానిస్తున్న నేతలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి



చిన్నబజారు మసీదులో ఆసార్ చూస్తున్న ముస్లింలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 16 : నగరంలో సోమవారం మహ్మద్ ప్రవక్త (మిలాద్ ఉన్ నబీ) జన్మదినం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ట్రైలర్స్ కాలనీ, ఆత్మకూరు బస్టాండ్, రంగనాయకులపేట, జెండా వీధి, పెద్దబజారు, చిన్నబజారు, జాకీర్‌హుస్సేన్‌నగర్, ఎన్టీఆర్ నగర్, నవాబుపేటలలో హిందూ ముస్లిం నాయకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం చిన్నబజార్ షాహిషా మసీద్ మఖాన్‌లో మహ్మద్ ప్రవక్త యొక్క గడ్డం వెంట్రుకలను (అసాముభారకి) దర్శనం చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నగరంలో జూలూస్ (కృతజ్ఞత ర్యాలీ) జరిగింది. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.



బుచ్చిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం పెద్దలు, యువత

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు16: నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ముస్లింలు, వృద్ధ మహిళలు జాగారం చేసి ఖురాన్‌ను పఠించారు. కాశీపాళెం మసీదు నుంచి బుచ్చి బస్టాండ్ సెంటర్ వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు.

వరద సహాయ చర్యల్లో జిల్లా ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 16 : విజయవాడ వరద సహాయక చర్యలు, బుడమేరు పునరావాస కార్యక్రమాల్లో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు అందించిన సేవలు ప్రశంసనీయమని ఏపీజీఈఏ రాష్ట్ర సలహా సంఘం చైర్మన్ చొప్పా రవీంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి పీవీఎస్ఎస్‌టీ రాంప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు అలుపెరుగని సేవలందించారని తెలిపారు. వరద సహాయక విధులు నిర్వహించి తిరిగి జిల్లాలోని వారి విధులకు హాజరవుతున్న వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి 'అట్యాపాట్యా'లో జిల్లాకు పతకాలు



పోటీల్లో సత్తాచాటిన బాలికల జట్టు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 16 : కర్నూలు జిల్లా డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్ అట్యాపాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించాయి. బాలుర జట్టు ద్వితీయస్థానం, బాలికల జట్టు తృతీయస్థానం సాధించడంతో జట్లలోని క్రీడాకారులు పలువురు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పాండిచ్చేరిలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీలకు బాలుర విభాగంలో జి.సురేంద్ర, టి.సంతోష్, బాలికల విభాగంలో బి.సబిత, ఎ.ప్రత్యూషలు పాల్గొననున్నట్లు జిల్లా అట్యాపాట్యా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసాద్, కృష్ణవేణిలు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్, మేనేజర్లు అమరావతి, మమత, ప్రేమ్‌సాగర్‌లు అభినందించారు.

కాంగ్రెస్ నేత వెంకట్రావుకు సత్కారం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 16 : ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఉడతా వెంకట్రావు యాదవ్‌ను నగరంలోని ఇస్కాన్‌సిటీలో సోమవారం పలువురు నాయకులు శాలువా, పుష్పమాలతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయిలో పదవి వచ్చిన ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌కే రాజు, సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌యాదవ్, సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కలిచేడు సమస్యలపై 'జనవాణి'లో వినతి



సమస్యలు వివరిస్తున్న రవీంద్రనాథ్

సైదాపురం, సెప్టెంబరు 16: మండల పరిధిలోని కలిచేడు గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలపై మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చింతలపల్లి రవీంద్రనాథ్ సోమవారం మంగళగిరిలో నిర్వహించిన జనసేన జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిచేడు గ్రామంలో భూసమస్యలు, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్న మైకా కార్మిక సంక్షేమ సంస్థ ఉన్నత పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరినట్లు తెలిపారు. దీంతో సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తారని మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం వెల్లడించిందని తెలిపారు.

కల్యాణ మండపం అభివృద్ధికి చర్యలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 16 : నగరంలోని నవాబుపేటలో ఉన్న నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపం అభివృద్ధికి జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ చర్యలు తీసుకుందని సొసైటీ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జరిగిన సొసైటీ కార్యవర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఇటీవల అమెరికా నుంచి తిరిగి వచ్చిన సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు దంపతులను ఘనంగా సన్మానించారు.

జనసేనలో పని చేయడానికి సిద్ధం


● జై భీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 16: పదవుల కోసం కాకుండా జనసేన పార్టీ ఆశయాలకు అనుగునంగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జనసేనజిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌ను కలిసి తాము జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం చేయగలిగిన ఒకే నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఆయన ఆశయాలకు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా తమ వ్యవస్థ అంతటిని పార్టీకి మమేకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ పెద్దల సమ్మతితో త్వరలో పార్టీలోకి ఆహ్వానిస్తామని కిశోర్ హామీ ఇచ్చారు.



జనసేన పార్టీ కార్యాలయంలో కిషోర్‌ను కలిసిన జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

నిమ్మ అ'ధర'హో!



గూడూరు మార్కెట్లో నిమ్మకాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సాధారణంగా సెప్టెంబరు మాసంలో కిలో ధర రూ.50 మించదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ముందుగానే కోసేయడంతో ప్రస్తుతం మార్కెట్‌కు కాయలు సరిగా రావడం లేదు. ఈ క్రమంలో అడపాదడపా వచ్చిన కాయలు మంచి ధర పలుకుతున్నాయి. సోమవారం గూడూరు మార్కెట్లో కేజీ రూ.60 నుంచి రూ.110 ధర పలికింది. 50 కేజీల టిక్కీ బస్తా రూ.3వేలు నుంచి రూ.5,500 వరకు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండుకాయలు కేజీ రూ.50 నుంచి రూ.80 పలికాయి. పొడి కాయల(సన్నాలు)కు రూ.50 వరకు ధర లభిస్తోంది. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే గూడూరు ప్రాంత నిమ్మకాయలు నాణ్యంగా ఉండడంతో వ్యాపారులు ఎగబడుతున్నారు.

- గూడూరు అర్బన్

పవిత్ర ప్రతిష్ఠ



హోమపూజలు చేస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 16: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. ద్వార తోరణ, ధ్వజకుంభ ఆవాహనం, చక్రాధి మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మంగళవారం పవిత్ర సమర్పణ కార్యక్రమం ఉంటుంది. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

మెడిసిన్ అడ్మిషన్స్



మొదటి అడ్మిషన్ అందుకుంటున్న లిఖిత

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 16 : ఎస్వీ వైద్య కళాశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. లిఖిత అనే విద్యార్థినికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మొదటి అడ్మిషన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొత్తం 140 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఇందులో 18 సీట్లు ఆలిండియా ర్యాంకులో కేటాయిస్తామని చెప్పారు. మిగిలిన సీట్లు రాష్ట్ర కోటా కింద కేటాయిస్తామని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ మూడు విడతలుగా జరుగుతుందని, ఈనెల 19న సాయంత్రం 3 గంటలకు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ లోపు సీట్లు పొందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి

నలుగురికి బలమైన గాయాలు

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిని బయటపెట్టారనే కోపంతోనే..



గాయపడిన సలీం, ధనంజయ్య, రహీం - సలీంకు కుట్లు వేస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: మండలంలోని కల్లూరులో ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కల్లూరులో చిట్టిబోయిన చెంగయ్య ఎన్‌ఆర్‌ఈజీఎస్ క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్నాడు. లేని కూలీల పేర్లు నమోదు చేసి, భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఇట్టగుంట నాగప్రసాద్, ఇట్టగుంట ధనంజయ్య, ఎస్‌కే సలీం, ఎస్‌కే రహీంలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ సానుభూతిపరుడైన చెంగయ్యను తొలగించాలని కోరారు. ఈ విషయాన్ని చెంగయ్య కల్లూరుకండ్రిగకు చెందిన వైసీపీ నేతలు దార నాగేంద్ర, దార నరేంద్ర, దార హేమంత్, దార ప్రేమకుమార్, నిమ్మల సిసింద్రీలకు చెప్పాడు. వారు ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు పొలం పనుల్లో ఉన్న నాగప్రసాద్‌ను, అతనితో పాటు ఉన్న తోటకూర అంకయ్యలను కొట్టి బైక్‌పై కల్లూరుకండ్రిగకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని నాగప్రసాద్ ఫోన్ ద్వారా ధనంజయ్యకు సమాచారం ఇచ్చాడు. ధనంజయ్య ఎస్‌కే సలీం, ఎస్‌కె రహీంలను వెంటబెట్టుకుని కల్లూరు కండ్రిగకు వచ్చాడు. నాగప్రసాద్‌ను విడిపించాలని కోరగా వైసీపీ నేతలు కర్రలు, రాడ్లతో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. చిన్నపాటి గాయాలతో నాగప్రసాద్ పారిపోగా, మిగిలిన ముగ్గురికి తలపై బలమైన గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని గాయాలైన వారిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఇలా దాడులు చేయిస్తున్నాడని వారు ఆరోపించారు.

ఇరు వర్గాల ఫిర్యాదు నమోదు

టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేశామని, అదే సమయంలో వైసీపీ నాయకులు పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా తీసుకున్నామని ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని వివరించారు.





నెల్లూరుపల్లి ఓటిగుంట చెరువు పాతకట్టనే తవ్వి కొత్తదిగా రూపు మార్చారిలా.. - తూతూమంత్రంగా చేసిన అక్కరపాక చెరువు కట్ట పనులు

పాత పనులకు కొత్త కలరింగ్

ఎఫ్‌డీఆర్ వర్క్సులో కాంట్రాక్టర్ల చేతివాటం

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: తుఫాను సమయంలో తెగిన చెరువు కట్టలను బాగుచేసుకోవడం కోసం చేపట్టిన పనుల్లో(ఎఫ్‌డీఆర్) కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పాత పనులకు కొత్త కలరింగ్ చేసి, నిధులు స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. దొరవారిసత్రం మండలంలో అధికారుల అండదండలతో ఈ దందాకు రంగం సిద్ధమైంది. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను సమయంలో మండలంలో ఎక్కడా చెరువు కట్టలు తెగలేదు. అయితే ఇరిగేషన్ శాఖ అధికారులు 17 చెరువు కట్టలు దెబ్బతిన్నట్లు ప్రతిపాదనలు పంపారు. దీంతో ఎఫ్‌డీఆర్ కింద రూ.92.07 లక్షలు మంజూరయ్యాయి. నాటి వైసీపీ నాయకుల మెప్పుకోసం ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ నిధులు మంజూరు చేయించారు. అయితే పనులు చేస్తే బిల్లులు రావని గ్రహించిన వైసీపీ నాయకులు ఆ పనుల జోలికి వెళ్లలేదు. వాటిని అలాగే వదిలేశారు.

ముఖ్య నాయకుడి సిఫారసులతో..

కొత్త ప్రభుత్వంలో ఆ పనులు చేసేలా ఇరిగేషన్ శాఖ అధికారులు కదలిక తీసుకువచ్చారు. నియోజకవర్గ ముఖ్య నాయకుడి సిఫారసులతో అటు టీడీపీ నాయకులతో పాటు వలస వచ్చిన వైసీపీ వారు పనులను పంచుకున్నారు. మావిళ్లపాడు చెరువు ఆనకట్ట రూ.9.70 లక్షలు, మానేరి కొత్తట్యాంక్ రూ.9.50 లక్షల పనులు మాత్రం టెండరు దశలో ఆగి ఉన్నాయి. మిగిలిన 15 చెరువులకు రూ.4.80 లక్షల నుంచి రూ.4.95 లక్షల అంచనాలతో పనులు పూర్తి చేశారు.

పాత కట్టలకు కొత్త మట్టి..

2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో నీరు చెట్టు పథకంలో చెరువులను బాగా అభివృద్ధి చేశారు. ఇప్పటికీ కట్టలన్నీ బలంగానే ఉన్నాయి. ఎఫ్‌డీఆర్ పనుల్లో భాగంగా మొక్కలను తొలగించడం, పాత కట్టలను యంత్రాలతో తవ్వి కొత్త మట్టితో చదును చేసి పనులు పూర్తి చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. ఎక్కడ కూడా చెరువు కట్టలను బలోపేతం చేసే దిశగా పనులు చేయలేదు.

తాత్కాలిక పనులే కాబట్టి చూస్తాం..

ఎఫ్‌డీఆర్ పనులు తాత్కాలికమే కాబట్టి వాటికి పూర్తి స్థాయిలో బిల్లులు ఉండవు. కాబట్టి కొంత సడలింపు ఉంటుంది. పనులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- శ్రీధర్, డీఈఈ, సూళ్లూరుపేట

ఎంబీయూ విద్యార్థిపై హత్యాయత్నం కేసు..

పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: తిరుపతిలో శనివారం ఎంబీయూ (మోహన్‌బాబు యూనివర్సిటీ) విద్యార్థిపై హత్యాయత్నానికి పాల్పడిన కార్తీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎంబీయూలో పారా మెడికల్ కోర్సు చదువుతున్న ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన లోకేష్, సూళ్లూరుపేటకు చెందిన కావ్య తిరుపతిలోని పీజీఆర్ థియేటర్‌లో సినిమా చూస్తుండగా కార్తీక్ హత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. కావ్య, కార్తీక్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో కావ్యతో లోకేష్ స్నేహంగా ఉండడం సహించలేని కార్తీక్ అతన్ని కత్తితో పొట్టలో పొడిచి పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రెండు రోజులుగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సెల్ సిగ్నల్స్ ఆధారంగా సోమవారం సూళ్లూరుపేటలో అదుపులోకి తీసుకున్నారు. కార్తీక్‌తో పాటు కావ్యను పోలీసులు విచారిస్తున్నారు.

ఇంటెలిజెన్సు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: తిరుపతి రీజనల్ ఇంటెలిజెన్సు ఎస్పీగా వెంకటరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరోలో పనిచేస్తూ తిరుపతికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తుండిన రాఘవేంద్ర కర్నూలు ఇంటెలిజెన్సు ఆర్‌ఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటరాముడుకు డీఎస్పీలు కంజాక్షరం, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

అంగన్‌వాడీలకు ఆగిన కందిపప్పు

రెండు నెలలుగా సరఫరా లేక ఇక్కట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా కందిపప్పు సరఫరా ఆగిపోయింది. తద్వారా పప్పు లేకుండానే మధ్యాహ్న భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తూకంలో తేడాలు, ప్యాకెట్లలో గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో కందిపప్పు సేకరణ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలోని 2,131 అంగన్‌వాడీ కేంద్రాలు, 361 మినీ కేంద్రాలకు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కందిపప్పు లేకుండానే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. నీళ్లతో కూడిన కూరలు తినలేక అవస్థలు పడుతున్నారు. చాలామంది అన్నం కంచాల్లోనే వదిలేసి వెళ్లిపోతున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుమతిని వివరణ కోరగా కందిపప్పు కొనుగోలుకు అవసరమైన కమిటీని వారం రోజుల క్రితమే ఏర్పాటు చేశామని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

సెలవుల్లో సరదాగా గడుపుదామని వెళ్లి..

బాణసంచా పేలుడులో గాయపడిన బాలుడి మృతి - పిగిలాంలో విషాదఛాయలు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



ఉమామహేష్ (ఫైల్ ఫొటో)

బాలాయపల్లి, సెప్టెంబరు 16: పాఠశాలకు వరుసగా సెలవులు రావడంతో సరదాగా గడుపుదామని బంధువుల ఇంటికెళ్లాడు. వినాయక చవితి సందర్భంగా గ్రామోత్సవాన్ని తిలకిస్తుండగా జరిగిన బాణసంచా పేలుళ్లలో ప్రాణం పోగొట్టుకుని కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన కందలి శ్రీను, భార్గవిల కుమారుడు ఉమామహేష్(15) వెంకటగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లా మనుబోలులో బంధువుల ఇంటికెళ్లాడు. ఆదివారం మనుబోలు బీసీకాలనీ వద్ద వినాయకుడి గ్రామోత్సవాన్ని తిలకించేందుకు బంధువులతో కలిసి వెళ్లాడు. అక్కడ జరిగిన బాణసంచా పేలుళ్లలో తీవ్రంగా గాయపడడంతో నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నైకి తరలిస్తుండగా నాయుడుపేట సమీపంలో మృతిచెందాడు. సెలవులకు సరదాగా గడిపేందుకు వెళ్లిన ఉమామహేష్ విగతజీవిగా తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. విషాదఛాయల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

మల్లిమడుగు వద్ద అక్రమ మట్టి తవ్వకాల పరిశీలన



మల్లిమడుగు డ్యాం సమీపంలో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేణిగుంట, సెప్టెంబరు 16: మల్లిమడుగు డ్యాం గుట్టల నుంచి అక్రమ మట్టి దందాపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో సోమవారం ప్రభుత్వ జియాలజిస్టు రవికుమార్, తహసీల్దారు సురేష్‌బాబు, వీఆర్వో కృష్ణపిళ్లై సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎర్రమన్ను దిబ్బలు, రాయి పలకలు తవ్వినట్లు గుర్తించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎర్రమన్ను దిబ్బలు పూర్తిస్థాయిలో తవ్వకాలను గుర్తించారు. చీరాలమ్మ గుట్ట వెనుక ఉన్న మరో గుట్టలో సైతం డ్యాం అంచున ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేసుకుని మట్టిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

తిరుమలలో అనధికార తట్టల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

తిరుమల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పలు ప్రాంతాల్లో వెలసిన అనధికార తట్టలను సోమవారం అధికారులు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అండదండలతో తిరుమలలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అనధికార తట్టలు వెలసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి నేతల సహకారంతోనూ పలువురు తట్టలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్ద, డీఎంటీ రోడ్డు, పాత అన్నదానం, వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద దాదాపు 13కు పైగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అధికారికంగా టీటీడీ నుంచి లైసెన్స్‌లు పొంది అద్దె కడుతున్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మీడియాలో విమర్శలు రావడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు టీటీడీ టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమంగా పెట్టిన దుకాణాలను తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

అలిపిరి వద్ద భారీగా నిలిచిన వాహనాలు



తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడ వీధులు, అఖిలాండం, అన్నప్రసాద కేంద్రం, లడ్డూ కేంద్రం వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్ లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శనం పడుతోంది. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, గదులు కేటాయించే కౌంటర్లు కూడా రద్దీనే కనిపించాయి. స్లాటెడ్ దర్శనాలు కలిగిన భక్తులకూ రెండు నుంచి మూడు గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు తనిఖీల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అలిపిరి చెక్ పాయింట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన కృష్ణయ్య

చిట్టమూరు, సెప్టెంబర్ 16: ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ దుర్మరణం చెందిన ఘటన చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో సోమవారం జరిగింది. మండలంలోని దరఖాస్తు గ్రామానికి చెందిన చల్లా కృష్ణయ్య(50) ఆరూరులోని రైతు అశోక్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పేడ ఎరువు పొలాలకు తోలేందుకు బాడుగకు వెళ్లాడు. ఎరువు లోడ్‌చేసుకుని పొలాల్లోకి వెళ్లాడు. ట్రాక్టర్ హైగేర్‌లో పెట్టి ట్రాలీలోకి వెళ్లి ఎరువును కిందకు తోస్తుండగా ఎదురుగా గెనెం అడ్డు వచ్చింది. దానిని తప్పించేందుకు ట్రాలీ దిగి నెమ్మదిగా వెళ్తున్న ఇంజన్ లోకి ఎక్కేందుకు ప్రయత్నించే క్రమంలో కాలు జారి ముందు చక్రాల కింద పడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకొని కృష్ణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బంగారు ఆభరణాల స్వాధీనం



పట్టుబడ్డ నిందితుడు, ఆభరణాలతో సీఐ బాబి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఈ నెల 8వ తేదీ జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. శ్రీరామ్‌కాలనీలో నివాసం ఉంటున్న తిరుపాల్ ఇంట్లో నిద్రిస్తుండగా 8 సవర్ల బంగారు ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సోమవారం గోమతి సెంటర్ వద్ద పెళ్లకూరు మండలం దిగువచావాలి గ్రామానికి చెందిన చైతన్యను అరెస్టు చేసి, అతని దగ్గర నుంచి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరచిన పోలీస్ సిబ్బంది పోలయ్య, చిరంజీవి, వెంకటేశ్వర్లను సీఐ అభినందించారు.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి అరెస్టు

చిట్టమూరు, సెప్టెంబర్ 16: తన చావుకి ఇద్దరు కారణమంటూ ఓ వ్యక్తి మొబైల్‌లో రికార్డు చేసిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఇద్దరిని అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం దరఖాస్తు గ్రామానికి చెందిన చల్లా చెంగయ్య ఆగస్టు 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఈనెల 8న చంగయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు చెంగయ్య మొబైల్‌ను పరిశీలించగా సూసైడ్‌కు సంబంధించిన వీడియో భయట పడింది. తన భార్య దేవసేన, అదే గ్రామానికి చెందిన మల్లి కస్తూరయ్య మధ్య అక్రమ సంబంధం కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని చెంగయ్య వీడియో రికార్డు చేశాడు. దీంతో చెంగయ్య బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెంగయ్య భార్య దేవసేన, కస్తూరయ్యను సోమవారం అరెస్టు చేసి కోట కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ చిన్నబలరామయ్య తెలిపారు.

బైక్‌ల చోరీ కేసుల్లో ఇద్దరికి రిమాండ్

తడ, సెప్టెంబరు 16: బైక్‌లు చోరీచేసే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి పట్టుకునే ప్రయత్నించగా కత్తితో దాడి చేసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. సూళ్లూరుపేట మండలం తేవలతేరికట్ట గ్రామానికి చెందిన కంచి వంశీ, అదే మండలం కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన బందిలి సూర్యనారాయణ అలియాస్ మిరకాయగా తెలిసింది. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో రెండు హత్యాయత్నం కేసులతో పాటు, మరికొన్ని కేసులు ఉన్నట్లుగా విచారణలో తేలింది. నిందితులిద్దరినీ సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన



అన్నా క్యాంటీన్ పరిశీలిస్తున్న కమిషనర్

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

కార్మికుల సంక్షేమమే ఎస్‌డబ్ల్యూఎఫ్ ధ్యేయం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 16: ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ఎస్‌డబ్ల్యూఎఫ్ ధ్యేయమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేషయ్య, రఘురామయ్య, రమణయ్య, గురువయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని ఆర్టీసీ డిపో వద్ద సాఫ్ట్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. డీవీ రమణయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రీజనల్ సహాయ కార్యదర్శి ఎస్‌ఆర్ చంద్రయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో సాఫ్ట్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా నిలిచిందని ప్రసంశించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి నజీర్‌బాషా, సహాయ కార్యదర్శి బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



ఆదెమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం మండల పరిధిలోని దావాది గుంటకు చెందిన చందనమూడి ఆదెమ్మ(75) మరణించడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో చెన్నై శంకర నేత్రాలయకు నేత్ర దానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేట పట్టణం నడిబొడ్డులో ఓ చిల్లర దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బాపూజీ వీధిలోని గాంధీకి దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. గల్లా పెట్టెలో రూ.500 నగదు ఎత్తుకెళ్లాడు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు మట్టి టిప్పర్ల స్వాధీనం

దొరవారిసత్రం, సెప్టెంబరు 16: దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. రోసనూరు గ్రామం నుంచి నెలబల్లి మీదుగా నాయుడుపేటకు గ్రావెల్ తీసుకెళుతున్న టిప్పర్లు ఓవర్ లోడ్‌తో పాటు, సరైన బిల్లులు లేకపోవడంతో జరిమానా విధించి సోమవారం విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి సమీపంలోని బస్‌షెల్టర్‌లో సోమవారం ఓ వ్యక్తి మృతి చెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. స్థానిక పీఎస్‌ఆర్ పార్కు ప్రాంతానికి చెందిన ముక్తియార్(60)గా గుర్తించారు. అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లిపోతూ ఉంటాడని, ఆరోగ్యం సరిగా లేక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

చిల్లకూరు, సెప్టెంబరు 16: మండలంలోని తమ్మిన పట్నం, గుమ్మళదిబ్బ గ్రామాల్లో సోమవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు డాక్టర్ సుహర్షన్‌రెడ్డి వైద పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలే బీజేపీ టార్గెట్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: ప్రతి నియోజక వర్గంలో లక్ష సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకుని నమోదు చేయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు, నాయకులు ఏగేశ్వరరావు, దామ గురుప్రసాద్, వర ప్రసాదు, బాలాజీ పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: స్థానిక అడివయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో సోమవారం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి నిరాధరణకు గురైన వారికి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూరపాటి రవీంద్ర బాబు, బాషాజాన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీసేవ



పల్లకీసేవలో గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి

గూడూరు, సెప్టెంబరు 16: స్థానిక రైల్వేక్వార్టర్స్ సమీపంలోని వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గణపతి హోమం, పూర్ణాహుతి పూజలు జరిపారు. అనంతరం గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెళ్లకూరు సెప్టెంబరు 16: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ కే నాగరాజు పట్టుకున్నారు. మండలంలోని కలవకూరు స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సోమవారం సమాచారం రావడంతో ఎస్‌ఐ కే నాగరాజు దాడులు చేసి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసా దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

గూడూరు, సెప్టెంబరు 16: పట్టణంలో సోమవారం ముస్లింలు మిలాద్‌ఉన్‌నబీ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక దర్గా సమీపంలోని చిన్నమసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలో పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు.

ఓజిలి: మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకున్నారు. ఓజిలితో పాటు రాచపాళెం, కార్జిమేడు, కురుగొండ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కాలువలు పూడ్చివేసి... గ్రావెల్ తరలించి..!



చెందోడు వద్ద గంగకాలువను పూడ్చివేసి పొలంగా మార్చిన దృశ్యం

కోట, సెప్టెంబరు 12: కోట మండల పరిధిలోని తెలుగు గంగ కాలువలను కొందరు రైతులు పూడ్చివేస్తున్నారు. అలాగే కొందరు కాలువల పక్కన గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోట మండలానికి 7వ బ్రాంచ్ కెనాల్ నుంచి కొండుగుంట వరకు గంగనీరు వస్తుంది. అక్కడ నుంచి బ్రాంచ్ కాలువల ద్వారా కోట మేజర్, కర్లపూడి మేజర్ కాలువల ద్వారా మండలంలోని పలు చెరువులు, మెట్ట పొలాలకు వెళ్తుంది. అయితే రెండేళ్లుగా కేశవరం, చిట్టేడు, గూడలి సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువ కుడి ఎడమల నుంచి వేలాది రూపాయల విలువచేసే గ్రావెల్‌ను అక్రమార్కులు రాత్రికిరాత్రే టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో గంగకాలువలు బలహీనపడి పూడిపోతాయనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కోట మేజర్ కాలువ నుంచి చెందోడు మీదుగా కర్లపూడి మేజర్ గంగకాలువ వెళ్తుంది. ఈ కాలువ మొదట్లో 11.8 కిలోమీటర్లు కర్లపూడి వరకు కాలువ నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే కోట మేజర్ నుంచి పెన్నక్కచెరువు వరకు 3.8 కిలోమీటర్లు కర్లపూడి మేజర్ కాలువ తవ్వారు. ఈ కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులకు 2009-10లోనే పరిహారం చెల్లించారు. అయితే ఈ ప్రాంతంలో భూములకు మంచి గిరాకీ ఉండటంతో గంగకాలువలు సైతం పూడ్చివేసి పొలాలుగా మార్చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఈ వ్యవహారం జరుగుతూ ప్రస్తుతం సర్దుమణిగి ఉంది. రెవెన్యూ, తెలుగుగంగ అధికారులు కాలువలు పూడ్చివేసిన వారికి హెచ్చరికలు జారీచేసినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా గంగకాలువలను పూడ్చి వ్యవసాయ భూములుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే గంగనీరు మండలానికి రావడం కష్టతరంగా మారుతుంది. దీంతో వేలాది ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉంది. సంబంధింత అధికారులు స్పందించి కాలువల పూడ్చివేతతో పాటు గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తెలుగుగంగ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా కాలువల పూడ్చివేతలపై ఆరాతీస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వీధి కుక్కల బెడదతో జనం బెంబేలు

పీహెచ్‌సీల్లో అరకొరగా రేబిస్ టీకాలు



తోలిమిట్టలో కుక్కల గుంపు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: వెంకటగిరి పట్టణంలో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధుల వెంట పడుతున్నాయి. చిన్న పిల్లలు అయితే భయంతో వణికిపోతున్నారు. రహదారుల వెంట నడిచి, ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇక రాత్రి గంటలు దాటితే తిరిగే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 25వార్డుల్లో సుమారు 2వేల వరకు వీధి కుక్కలు ఉంటాయని అంచనా. బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, క్రాస్‌రోడ్డు, మల్లమ్మగుడి వీధి, తోలిమిట్ట, పీర్లతీ పేట, మార్కెట్ వీధి, కాంపాళెం తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల తొలిమిట్టలో ఓ పిచ్చి కుక్క ముగ్గురిని గాయపరించింది. అధికారులకు ఫిర్యాదు చేసినా సమయానికి స్పందించలేదని, చాలా సేపటి తరువాత మున్సిపాలిటీ సిబ్బంది వచ్చి పిచ్చి కుక్కను పట్టుకుని తీసుకుని వెళ్లారు. అలాగే ఇటీవల ఓ వ్యక్తి కుక్క కరిచిందని పట్టణంలోని సీహెచ్‌సీకి వెళ్తే అక్కడి సిబ్బంది పట్టించుకోలేదని, దీంతో ప్రైవేటు ఆస్పత్రలో చూపించుకున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని పీహెచ్‌సీల్లో రేబీస్ టీకాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి పట్టణంలో వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, అలాగే పీహెచ్‌సీల్లో రేబీస్ టీకాలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ప్యాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధే లక్ష్యంగా సదరన్ రైల్వే ప్యాసింజర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని అధ్యక్షుడు మస్తాన్ తెలిపారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని, స్టాపింగ్‌లేని పలు రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకునేలా అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలసి విన్నవించారు. స్పందించిన ఆయన సదరన్ రైల్వే డీఆర్‌ఎంవీ విశ్వనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెము రైల్‌ను నాయుడుపేట వరకు కొనసాగించాలని వైస్ ప్రెసిడెంట్ ఆర్ రాఘవన్ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఆర్‌ఎంవీ త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెంగాళమ్మ ఆలయంలో 3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు తెలిపారు. ఒక్కొక్కరోజు ఒక్కో అవతారంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 3న పరమేశ్వరి అలంకారం, 4న గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న బాలత్రిపుర సుందరి, 7న అష్టకాళి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి, 11న రాజరాజేశ్వరి, 12న మహిషాసుర మర్థిని అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన సుజిత్ - ప్రమాదానికి గురైన వాహనం

చిల్లకూరు, సెప్టెంబరు 16: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి నాయుడుపేట మండలం మేనకూరుకు గ్లాజ్ లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనం క్రాస్‌రోడ్డు వద్ద టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్‌కు గాయాలయ్యాయి. అతడిని హైవే అంబులెన్స్ సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



చెక్కులు అందుకున్న పేద విద్యార్థులు

కోట, సెప్టెంబరు 16: ప్రతిభా పాటవాలు కలిగి చదువుకోవాలనే తపన ఉన్న పేద విద్యార్థులను దాతల సహకారంతో ఆదుకొని అండగా ఉంటామని షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, సీతారామ ధార్మిక సేవాసంస్థ ప్రతినిధి దీవీ అనంతాచార్యులు హామీ ఇచ్చారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పది మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున 30వేల చెక్కులను అల్లం రమణయ్య, దీవీ అనంతాచార్యుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో సుధీర్‌శర్మ, శేషాద్రిశర్మ, చంద్రమౌళీశ్వర శర్మ, నంద, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ సోమవారం వాకాడు మండలం జాంద్రపేట గ్రామానికి చెందిన శ్రీనాథ్ అనే విద్యార్థికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రామ్మోనరావు, ప్రభాకర్, పెంచలయ్య, శ్రీనివాసులు, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిసాయం అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

వేడుకగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

గూడూరు, సెప్టెంబరు 16: స్థానిక ముత్యాలపేటలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తెనాలి బ్యాండు, తప్పెట్లు, యువత చిందుల నడుమ పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెలవలకు సన్మానం



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డిలను ఇటుక బట్టీల యజమానులు సోమవారం సన్మానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఇటుక బట్టీ యజమానులు రామయ్య నాయుడు, జీవీఆర్ నాయుడు, సాయి పాల్గొన్నారు.

కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

నాయుడుపేట, సెప్టెంబరు 16: నాయుడుపేట మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ సాధుశాంతి కుమారుడు సాయినవీన్(37) అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణంలోని రాజగోపాలపురంలో సోమవారం సాయి నవీన్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపాలిటీ చైర్ పర్సన్ కటకం దీపిక, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, షబ్బీర్, దారా రవి నివాళులర్పించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 16: అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొని సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు గ్రామంలో ప్రధాన వీధి నుంచి పొలాల్లోకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకొన్నాయి. దీంతో చిన్నపాటి వర్షమొచ్చినా, గాలివీచినా కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని గ్రామ స్తులు చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రతినెలా లైన్ల మరమ్మతులు చేపడుతున్నా ఈ స్తంభాలకు అల్లు కొన్న చెట్ల తీగలను తొలిగించకపోవడం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జంతు బలులను నిషేధించాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16: జంతు బలులను నిషేధించాలని సుభాష్ పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వహకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం ఆహారం కాదన్నారు. వేల సంఖ్యలో జంతువులు బలి అవుతున్నాయని, ఈ సంస్కృతిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.